

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 31-08-2025 | సంపుటి - 24 | సంచిక - 113 రూ : 4 | పేజీలు: 8




2లో

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై

# తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

- రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- రిజర్వేషన్లపై గత ప్రభుత్వం విధించిన పరిమితిని ఎత్తివేస్తూ జీవో జారీ చేయాలని నిర్ణయం
- కోదండరామ్, అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయాలని కేబినెట్ నిర్ణయం

పారాసిటమాల్‌తో

# జాగ్రత్త



2లో

- అధికంగా తీసుకుంటే కాలేయానికి ముప్పు
- దేశంలో ప్రమాదకరంగా ఫ్యాటీ లివర్ కేసులు
- అంతర్జాతీయ సదస్సులో నిపుణులు

ఎస్‌సీవో సదస్సు కోసం చైనాలో

# అడుగుపెట్టిన ప్రధాని



2లో

- ఎస్‌సీవో శిఖరాగ్ర సదస్సు కోసం చైనాకు ప్రధాని మోదీ
- టియాన్జిన్ నగరానికి చేరుకున్న భారత ప్రధాని
- చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ప్రత్యేకంగా భేటీ
- రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ చర్చలు జరపనున్న మోదీ
- అమెరికా సుంకాల నేపథ్యంలో పర్యటనకు పెరిగిన ప్రాధాన్యం



# మురుగు పొంగొద్దు.. నీట మునగొద్దు

- సిల్ట్ రిమూవల్ పనుల్లో హైడ్రా తలమునకలు..
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్..
- కృష్ణానగర్ నివాసితులతో త్వరలో సమావేశం..

**హైదరాబాద్, ఆగస్టు 30:** అమీర్ పేట వద్ద వరద ముప్పు నివారణకు హైడ్రా చర్యలు కొనసాగుతున్నాయి. సంబంధిత శాఖల సహకారంతో పెద్దమొత్తంలో పూడిక తీత పనులు జరుగుతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంతాల్లో పర్యటించి సమస్య పరిష్కారానికి దిశా నిర్దేశం చేసిన విషయం విధితమే. ఈ క్రమంలోనే అమీర్ పేట తో పాటు.. కృష్ణానగర్ లోని వరద ముప్పు ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం మరోసారి పర్యటించారు. వర్షాల సమయంలో వరద, నిత్యం మురుగు ముంచెత్తే ప్రాంతాలన్నిటినీ కలియదిరిగారు. దశాబ్దాలుగా పేరుకుపోయిన పూడికతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నాలాలను పరిశీలించారు. ఈ నెల 26న పర్యటించి.. నాలాల్లో పూడికతీతకు ఆదేశించిన తర్వాత ఆ ప్రాంతాలలో పనులను పర్యవేక్షించారు. స్థానికులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ఉన్న అవకాశాలను చర్చించారు. ఇటీవల హైడ్రా వచ్చి పూడిక తీత పనులను చేపట్టాక పరిస్థితి కొంతమేర మెరుగుపడిందని.. ఈ పనులు కొనసాగించాలని హైడ్రా కమిషనర్ కు పలువురు విజ్ఞప్తి చేశారు. త్వరలోనే అందరితో సమావేశాన్ని ఏర్పాటు చేసి..

తరువాయి 2లో

వెంకన్నపై భారం వేసి

# బుల్లెట్‌లా దూసుకెళతా



2లో

- కుప్పం నియోజకవర్గానికి చేరిన కృష్ణా జలాలు.. పరమసముద్రం వద్ద జలహారతి
- రాయలసీమను రత్నాల సీమగా మార్చే బాధ్యత తనదేనని చంద్రబాబు స్పష్టీకరణ
- వైసీపీ హయాంలో ప్రాజెక్టులపై కేవలం రూ. 2 వేల కోట్లే ఖర్చు చేశారని విమర్శ
- వచ్చే ఏడాదికల్లా చిత్తూరుకు కూడా హంద్రీనీవా నీళ్లు అందిస్తామని హామీ



2లో

# అసెంబ్లీ సమావేశాలు రెండ్రోజులే జరుపుతారట!

: హరీశ్ రావు

# అసెంబ్లీకి రాకపోతే తప్పు ఒప్పుకున్నట్టే



2లో

# వెంకన్నపై భారం వేసి బుల్లెట్‌లా దూసుకెళతా: సీఎం చంద్రబాబు

**అమరావతి ఆగస్టు 30:** పవిత్రమైన సంకల్పంతో ఏ పని మొదలుపెట్టినా విజయం తథ్యమని, ఆ తిరుమల వెంకన్నపై పూర్తి భారం వేసి రాష్ట్రాభివృద్ధి కోసం బుల్లెట్‌లా ముందుకు దూసుకెళతానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. కరవుతో అల్లాడే రాయలసీమను రతనాల సీమగా మార్చే పూర్తి బాధ్యత తనదేనని ఆయన ఉద్ఘాటించారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రం వద్దకు కృష్ణా జలాలు చేరుకున్న చారిత్రక సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముందు ఆయన కృష్ణా నదికి జలహారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "ఈ జలాలతో కుప్పానికి రెండేళ్ల ముందే కృష్ణా పుష్కరాలు వచ్చాయి. ఒకప్పుడు కరవు వస్తే పశువుల దాహం తీర్చడానికి రైళ్లలో నీళ్లు తెప్పించుకున్న దుస్థితి నుంచి, ఇవాళ 738 కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణా జలాలను ఇక్కడికి తీసుకురాగలిగాం. ఇది తెలుగుదేశం ప్రభుత్వ ఘనత. మల్యాల నుంచి 27 లిఫ్ట్ ఇరిగేషన్ల ద్వారా నీటిని తరలించి అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 110 చెరువులను నింపే అవకాశం ఇప్పుడు కలిగింది" అని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించగలిగితే తన జన్మ సార్థకమవుతుందని ఆయన భావోద్వేగంగా అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "2014-19 మధ్య కాలంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం మేము రూ.12,500 కోట్లు ఖర్చు చేస్తే, వైసీపీ ఐదేళ్ల పాలనలో కేవలం రూ.2 వేల కోట్లతో సరిపెట్టింది. వాళ్లు అసత్యాలు చెప్పడంలో దిట్టలు. గేట్లతో సెట్టింగ్‌లు చేసి నీళ్లు తెచ్చినట్లు నాటకాలడటం తప్ప చేసిందేమీ లేదు. మేము కష్టపడి నీళ్లు తీసుకొస్తే ఇప్పుడు జీర్ణించుకోలేకపోతున్నారు" అని మండిపడ్డారు. మంచి పనులను అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్న వైసీపీ ఒక విషవృక్షంగా మారిందని, దమ్ముంటే అభివృద్ధి, సంక్షేమంలో పోటీ పడాలని సవాల్ విసిరారు. భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, హంద్రీనీవా ఫేజ్ 1, ఫేజ్ 2 ప్రాజెక్టుల ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందించడంతో పాటు పరిశ్రమలకు కూడా నీళ్లు ఇస్తామని తెలిపారు. "ఇప్పుడు కుప్పానికి నీళ్లు వచ్చాయి. రాబోయే ఏడాది కాలంలోగా హంద్రీనీవా ద్వారా చిత్తూరుకు కూడా నీళ్లు ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటున్నాను" అని హామీ ఇచ్చారు. పోలవరంబనకచర్ల అనుసంధానం పూర్తి చేసి, వంశధార నుంచి పెన్నా నది వరకు నదులను అనుసంధానిస్తే రాష్ట్రంలో కరవు అనే మాటే వినిపించదని స్పష్టం చేశారు. నీళ్లు లేని పరిస్థితి వస్తేనే నీటి విలువ తెలుస్తుందని, భూమిని కూడా ఒక జలాశయంగా మార్చడం ఎంతో ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. నదుల అనుసంధానం ప్రయోజనాలను తెలంగాణ నేతలు కూడా గ్రహించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

**హైదరాబాద్ ఆగస్టు 30 :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల్లో రిజర్వేషన్‌పై గత ప్రభుత్వం విధించిన పరిమితిని ఎత్తివేస్తూ జీవో జారీ చేయాలని నిర్ణయించింది. దీని ఆధారంగా ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్‌లను ఎంపిక చేయాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది. గతంలో అమీర్ ఖాన్‌కు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఈసారి ఆయన స్థానంలో అజారుద్దీన్‌కు అవకాశం ఇచ్చింది. ఈ మేరకు కోదండరామ్, అజారుద్దీన్‌ల పేర్లను సిఫార్సు చేస్తూ గవర్నర్‌కు పంపించింది.

## అసెంబ్లీకి రాకపోతే తప్పు ఒప్పుకున్నట్టే : కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి ఫైర్

**హైదరాబాద్ ఆగస్టు 30:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై రేపటి నుంచి శాసనసభలో చర్చ జరగనుందని, ఈ చర్చకు కేసీఆర్ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ సభకు రాకపోతే కాళేశ్వరం విషయంలో జరిగిన తప్పును స్వయంగా అంగీకరించినట్లే అవుతుందని అన్నారు. కాళేశ్వరం అంశంలో తప్పు జరిగింది కాబట్టే కేసీఆర్ భయపడుతున్నారని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆ భయంతోనే ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారని ఆరోపించారు. "అసెంబ్లీకి రావాల్సిందే.. తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే" అని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ సభకు వచ్చి చర్చలో పాల్గొని, ప్రభుత్వ ఆరోపణలకు జవాబివ్వాలని సవాల్ విసిరారు. మరోవైపు, తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి పట్ల సంతాప తీర్మానాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా, గోపీనాథ్ విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా, శాసనమండలిలో మాజీ ఎమ్మెల్సీలు రత్నాకర్, రంగారెడ్డి మృతి పట్ల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి నివాళులర్పించారు.

## అసెంబ్లీ సమావేశాలు రెండ్రోజులే జరుపుతారట!

- **అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించకుండా పారిపోతున్నారని విమర్శ**
- **వరదలపై చర్చకు వస్తే అధికార కాంగ్రెస్ పార్టీ బురద రాజకీయం చేస్తోందని ఆగ్రహం**
- **సమావేశాలు 15 రోజుల పాటు నిర్వహించాలని బీఏసీలో కోరామన్న హరీశ్ రావు**

**హైదరాబాద్ ఆగస్టు 30 :** వరదలపై చర్చకు వస్తే అధికార కాంగ్రెస్ పార్టీ బురద రాజకీయం చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించకుండా పారిపోతున్నారని ఆయన విమర్శించారు. బీఏసీ నుంచి వాకౌట్ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రెండు రోజులే అసెంబ్లీ నడిపిస్తామని ప్రభుత్వం చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజుల పాటు నిర్వహించాలని బీఏసీలో కోరామని హరీశ్ రావు తెలిపారు. వరద నష్టాలు, ఎరువుల కొరత, గురుకులాల్లో వందకు పైగా మరణాలు, విద్యార్థుల ఫీజు రీయింబర్సుమెంట్ గురించి అసెంబ్లీలో చర్చించాలని కోరామని ఆయన అన్నారు.

## పారాసిటమాల్‌తో జాగ్రత్త

హైదరాబాద్: చిన్న జ్వరమొచ్చినా... కాస్త ఒళ్లు నొప్పులున్నా.. తక్కుమని పారాసిటమాల్ మాత్రలు తీసుకుంటున్నారా..? అయితే తస్మాత్ జాగ్రత్త.. మీ కాలేయం ప్రమాదంలో ఉన్నట్లేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టీబీ మందులు వాడే రోగులూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. పసరు, నాటు మందులు కాలేయాన్ని ప్రమాదంలోకి నెడతాయని పేర్కొంటున్నారు. శనివారం స్టార్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మైండ్‌స్పేస్‌లోని ఓ హోటల్‌లో 'లివర్ టాక్స్' పేరుతో నిర్వహించిన జాతీయ సదస్సులో పలువురు వైద్య నిపుణులు మాట్లాడారు. లివర్ ఫంక్షన్ టెస్టు, అల్ట్రాసౌండ్, ఫైబ్రోస్కాన్, లివర్ బయాప్సీ లాంటి పరీక్షలతో కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.

**100లో 30 మంది మద్యపాన పీడితులే**

- **మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, స్టార్ ఆసుపత్రి**



వంద లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు జరుగుతుంటే అందులో 30 మంది మద్యపాన బాధితులే ఉంటున్నారు. మిగతా 30 మంది ఫ్యాటీ లివర్ కారణంగా వస్తున్నారు. పదేళ్లుగా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. ఫాస్ట్‌ఫుడ్, అధిక నూనె, వేపుళ్ల ఆహారంతోపాటు డెస్క్‌జాబ్‌ల కారణంగా లివర్‌లో కొవ్వు చేరుతోంది. దీనికితోడు వ్యాయామం లేకపోవడంతో కాలేయం దెబ్బతింటోంది. మధుమేహం, అధిక బరువు సమస్యలుంటే ఏటా ఒకసారి లివర్ పరీక్షలు తప్పనిసరి.

**తక్కువ కార్బోస్.. ఎక్కువ ప్రొటీన్**

- **కె.రవీంద్రనాథ్, సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు**



శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, కొవ్వు, అతిగా వేయించిన ఆహారాలను చాలా తగ్గించాలి. చిరుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, ప్రొటీన్ పదార్థాలు ఎక్కువగా తినాలి. వారానికి కనీసం 151 నిమిషాలు వ్యాయామం చేయాలి. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చాలా సురక్షితం.

## ఎస్‌సీవో సదస్సు కోసం చైనాలో అడుగుపెట్టిన ప్రధాని మోదీ

**చైనా, ఆగస్టు 30:** అమెరికాతో వాణిజ్య సంబంధాలు కాస్త బెడిసికొట్టిన కీలక తరుణంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చైనా పర్యటనకు వెళ్లారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన శనివారం చైనాలోని టియాన్జిన్ నగరానికి చేరుకున్నారు. ఏడేళ్ల విరామం తర్వాత చైనాలో అడుగుపెట్టిన ప్రధాని మోదీకి అక్కడి ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. ఇటీవల భారత్‌పై అమెరికా 50 శాతం మేర వాణిజ్య సుంకాలను విధించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నందుకు గానూ ఇందులో 25 శాతం సుంకాన్ని విధించింది. ఈ పరిణామాల నేపథ్యంలో




మోదీ చైనా పర్యటనకు అంతర్జాతీయంగా ప్రాధాన్యం ఏర్పడింది. ప్రపంచ దేశాలన్నీ ఈ పర్యటనను ఆసక్తిగా గమనిస్తున్నాయి. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ప్రత్యేక ఆహ్వానం మేరకు మోదీ ఈ పర్యటన చేపట్టారు. సదస్సు సందర్భంగా ఆయన జీ జిన్‌పింగ్‌తో పాటు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తోనూ విడిగా సమావేశం కానున్నారు. ఇతర దేశాల నేతలతోనూ ప్రధాని చర్చలు జరిపే అవకాశం ఉంది. జపాన్ పర్యటనను ముగించుకున్న వెంటనే ప్రధాని మోదీ నేరుగా చైనాకు బయల్దేరి వెళ్లారు.

## ట్రంప్ వల్ల అమెరికా పరువు పోతోంది..

### భారత్‌ను చైనా వైపు నెడుతున్నారు: యూఎస్ మాజీ అధికారులు ఫైర్

- **భారత్‌పై ట్రంప్ విధించిన భారీ సుంకాలపై తీవ్ర వ్యతిరేకత**
- **ట్రంప్ విధానాలు అమెరికా ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయన్న మాజీ జాతీయ భద్రతా సలహాదారు**
- **అమెరికా కంటే చైనా బాధ్యతాయుతమైన దేశంగా కనిపిస్తోందని వ్యాఖ్య**

**అమెరికా, ఆగస్టు 30 :** భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన భారీ సుంకాలపై సొంత దేశంలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ట్రంప్ అనుసరిస్తున్న మొండి విధానాలు అమెరికా బ్రాండ్ ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా, వ్యూహాత్మకంగా కీలకమైన భారత్‌ను చైనాకు దగ్గర చేస్తున్నాయని వైట్‌హౌస్ మాజీ ఉన్నతాధికారి, గతంలో అధ్యక్షుడు జో బైడెన్‌కు జాతీయ భద్రతా సలహాదారుగా పనిచేసిన జేక్ సలివాన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవల 'ది బల్వార్క్' అనే పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన సలివాన్, ట్రంప్ విధానాల వల్ల అంతర్జాతీయంగా అమెరికా పలుచనైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఏడాది క్రితం లేనివిధంగా ఇప్పుడు చాలా దేశాల్లో అమెరికా కంటే చైనాయే ప్రజాదరణ పొందుతోంది. అమెరికా బ్రాండ్ ప్రతిష్ఠ మంటగలిసిపోతుండగా, చైనా మరింత బాధ్యతాయుతమైన దేశంగా కనిపిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ చర్యల వల్ల మిత్రదేశాలు అమెరికాను నమ్మలేని ఓ పెద్ద ఆటంకంగా చూస్తున్నాయని, అందుకే అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భావిస్తున్నాయని ఆయన తెలిపారు. భారత్‌తో లోతైన, స్థిరమైన సంబంధాన్ని నిర్మించుకోవడానికి తాము ప్రయత్నిస్తే, ట్రంప్ మాత్రం ఆ దేశంపై భారీ వాణిజ్య యుద్ధం ప్రకటించారని సలివాన్ విమర్శించారు. "ఈ పరిస్థితుల్లో, అమెరికాకు ప్రత్యామ్నాయంగా బీజింగ్‌తో చర్చలు జరపాల్సి వస్తుందేమోనని భారత్ ఆలోచించే ప్రమాదం ఉంది" అని ఆయన హెచ్చరించారు. భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై అధ్యక్షుడు ట్రంప్ సుంకాలను 50 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. అన్యాయమైన వాణిజ్య పద్ధతులు, రష్యా నుంచి ముడి చమురు దిగుమతిని నిలిపివేయకపోవడమే ఇందుకు కారణమని ట్రంప్ ప్రభుత్వం అధికారికంగా చెబుతోంది. అయితే, పాకిస్థాన్‌తో వివాదంలో మధ్యవర్తిత్వం చేస్తానన్న ట్రంప్ ప్రతిపాదనను భారత్ తిరస్కరించినందుకే ఈ సుంకాలను విధించారన్న కథనాలు కూడా వినిపిస్తున్నాయి. ట్రంప్ విధానాలను కేవలం సలివాన్ మాత్రమే కాకుండా, గతంలో అమెరికా ప్రభుత్వంలో పనిచేసిన పలువురు ఉన్నతాధికారులు కూడా తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఒబామా హయాంలో విదేశాంగ మంత్రిగా పనిచేసిన జాన్ కెర్రీ, "గొప్ప దేశాలు బెదిరింపులకు పాల్పడవు, దౌత్యపరంగా ప్రయత్నిస్తాయి" అంటూ గతవారమే ట్రంప్ విధానాలను విమర్శించారు. అదేవిధంగా, ట్రంప్ మాజీ సహాయకుడు జాన్ బోల్టన్ కూడా స్పందిస్తూ, దశాబ్దాలుగా రష్యా, చైనాల నుంచి భారత్‌ను దూరం చేసేందుకు అమెరికా చేసిన ప్రయత్నాలను ట్రంప్ ప్రమాదంలో పడేశారని మండిపడ్డారు.

## కాళేశ్వరం కమిషన్ నివేదికపై రేపే అసెంబ్లీలో చర్చ

**: మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్ ఆగస్టు 30:** అసెంబ్లీ సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలనే దానిపై రేపు నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శాసనసభ వ్యవహారాల కమిటీ (బీఏసీ) సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఆదివారం సభలో చర్చ జరుగుతుందన్నారు. ''బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆదివారం సభలో పెడతాం. కాళేశ్వరంపై సభలో భారత రాష్ట్రసమితి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు స్పీకరే




నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అన్ని అంశాలపై చర్చ చేయాలంటే.. నాలుగైదు రోజుల తర్వాత సభ నడుపుతాం. గణేష్ నిమజ్జనం, వరదల దృష్ట్యా సభను వాయిదా వేయాలి'' అని శ్రీధర్‌బాబు తెలిపారు.

**బీఏసీ నుంచి భారత రాష్ట్రసమితి వాకౌట్**

బీఏసీ సమావేశం నుంచి భారత రాష్ట్ర సమితి వాకౌట్ చేసింది. ఎరువుల కొరత, వరదలు, రైతుల సమస్యలపై రేపు చర్చ జరగాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ రాకపోవడంతో బీఏసీ నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు.

## తెలంగాణలో ఉద్యోగుల బిల్లులకు మోక్షం.. రూ.700 కోట్లు విడుదల

హైదరాబాద్: ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. శనివారం ఏకంగా రూ.700 కోట్లను ఆర్థికశాఖ అన్ని శాఖల ఉద్యోగుల వేతన ఖాతాల్లో జమ చేసింది. వీటిలో గత 20 నెలలుగా పెండింగులో ఉన్న సప్లిమెంటరీ వేతన బిల్లులకు ఒకేసారి రూ.392 కోట్లు విడుదలయ్యాయి. ప్రతినెలా జీతభత్యాలకు ప్రతి ప్రభుత్వ కార్యాలయం నుంచి బిల్లులను ఖజానా శాఖకు దాఖలు చేయడం ఆనవాయితీ. వీటిని దాఖలు చేసే సమయంలో ఎవరైనా ఉద్యోగుల జీతభత్యాలకు సంబంధించిన వివరాలు పెండింగులో ఉంటే సప్లిమెంటరీ పద్దు కింద మళ్లీ బిల్లును అదే కార్యాలయం దాఖలు చేస్తుంది. ఇలా గత రెండేళ్లలో దాఖలు చేసిన సప్లిమెంటరీ వేతన బిల్లులకు ఇంకా రూ.1,900 కోట్లను ఆర్థికశాఖ విడుదల చేయాల్సి ఉంది. వీటితోపాటు ఉద్యోగులకు సంబంధించిన అన్ని బిల్లులకు నెలనెలా రూ.700 కోట్ల చొప్పున దశలవారీగా ఇస్తామని జూన్‌లో మంత్రివర్గం ప్రకటించింది. కాగా, ఈ నెలకు సంబంధించిన



రూ.700 కోట్లను శనివారం ఉద్యోగుల ఖాతాల్లో వేసినట్లు ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. సప్లిమెంటరీ వేతన బిల్లులతోపాటు జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బిల్లులకు మరో రూ.308 కోట్లను చెల్లించినట్లు తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక, పింఛన్‌దారుల జాయింట్ యాక్షన్ కమిటీ (ఐకాస) ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇంకా ఉద్యోగుల బిల్లులకు రూ.10 వేల కోట్ల వరకు రావాల్సి ఉందన్నారు

# విద్యార్థులు ఎంచుకున్న రంగాలలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరం.. ప్రముఖ కిన్నెర వాయిద్య కారులు పద్మశ్రీ మొగులయ్య

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులు ఎంచుకున్న రంగాలలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరం అని ప్రముఖ కిన్నెర వాయిద్య కారులు పద్మశ్రీ మొగులయ్య అన్నారు. ఐడిపిఎల్ చౌరస్తా సమీపంలోని భాషిత జూనియర్ కళాశాల స్వాగతోత్సవ వేడుకలు శనివారం షాపూర్ నగర్ లోని శుభం కన్వెన్షన్ హాల్లో విద్యార్థుల కేరింతల నడుమ ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ప్రత్యేక అతిధులుగా జబర్దస్త్ ఫేమ్(కామెడీ నటులు) ఆనంద్,అప్పారావు, కళాశాల చైర్మన్ డాక్టర్. దాయక సత్యనారాయణ, డైరెక్టర్ టి.హేమలత లు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యలో శ్రద్ధ కఠోర శ్రమతో చదివి మంచి ఫలితాలు సాధించి ఐఐటి,నీట్





లో రాష్ట్ర,జాతీయ ర్యాంకులు సాధించి భాషిత కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం భీమ్లా నాయక్ చిత్రంలోని పాట పాడి ఆయన విద్యార్థుల్లో జోష్ నింపారు.జబర్దస్త్ ఫేమ్స్ ఆనంద్, సుబ్బారావు,లు పలు హాస్య సన్నివేశాలు చేస్తూ,పాటలు పాడుతూ విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు. కళాశాల చైర్మన్ డాక్టర్ దాయక సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా విద్యనందిస్తూ వారిని ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. తల్లిదండ్రుల కలలు సాకారం చేసేది నేటి విద్యార్థులేనన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో తోపాటు మిస్టర్ పర్ఫెక్ట్,మిస్సెస్ పర్ఫెక్ట్,క్యాట్ వాక్ తో పాటు పలు గేమ్స్ లతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ టీ.శైలజ,కళాశాల యాజమాన్య సభ్యులు టి. శ్రీవిద్య,టి.కృష్ణ,కళాశాల అధ్యాపక బృందం,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా పూజలందుకున్న లంబోదరుడు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని మాధవరం కాలనీ సంపద ఎంక్లేవ్ అపార్ట్మెంట్ , కమల ప్రసన్న నగర్ లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు స్థానికులతో కలసి సందర్శించి గణనాథుడికి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అన్నదానం..మహా ప్రసాదం

**:ఎమ్మెల్యే సతీమణి కోరం లక్ష్మి**



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: గణేష్ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని స్థానిక మూడవ వార్డులో వాయిసేన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సతీమణి కోరం లక్ష్మి పాల్గొన్నారు.ఈ మేరకు ఆమె మాట్లాడుతూ అన్నదానం మహా ప్రసాదం అని అన్నారు.అన్ని దానాల కన్న అన్నదానం గొప్పదన్నారు.అనంతరం కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

**జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి**





ప్రజాస్ఫూర్తి ఇల్లందు : ఇల్లందు పట్టణ సబ్ జైల్ ను శనివారం జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి సందర్శించారు. సబ్ జైల్ పరిసరాలను, వంటశాలను పరిశీలించారు. వర్షాకాలం వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఖైదీలు పరిశుభ్రత పాటించాలని సూచనలు చేశారు.అనంతరం పలు రికార్డులు తనిఖీ చేశారు. ఖైదీలకు మెనూ ప్రకారం సదుపాయాలు అందుతున్నాయో లేవో అడిగి తెలుసుకున్నారు. జైలు జీవితం ఒక పాఠం గా చేసుకొని నేరారోపణ ఎదుర్కొంటున్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని, జైలు నుండి విడుదలైన అనంతరం జైలు జీవితం మర్చిపోయి సంఘంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు తెచ్చుకోవాలని తెలిపారు. అనంతరం ఖైదీలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జి గారితో పాటు ఇల్లందు బార్ అధ్యక్షులు కంపెనీ ఉమేశ్వరరావు ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, సబ్ జైల్ సూపర్డెంట్ చంద్రశేఖర్ ,హెడ్ వార్డెన్, బజరంగ్ రాజు, జైలు సిబ్బంది, భాస్కర్, శ్రీనివాస్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అన్నం.. పరబ్రహ్మ స్వరూపం

* **గణనాథుని వద్ద అన్నదానం**
* **బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అన్నం.. పరబ్రహ్మ స్వరూపమని.. అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం గౌడ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయక విగ్రహం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాతలు బత్తుల లక్ష్మయ్య వరలక్ష్మి దంపతులు, బత్తుల విప్లవ్ గౌడ్ వాణి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ పురాణాల ప్రకారం దానాల్లో ఉత్తమమైన దానం అన్నదానమన్నారు. ఆకలితో ఉన్న వారికి ఒక పూట భోజనం పెట్టి, వారి కడుపు నింపడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందన్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా అన్నదానం చేయడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ యాదగిరి , సంఘం నాయకులు చింతకింది అంజయ్య గౌడ్, బత్తుల శ్రీశైలం గౌడ్, సుర్వి నరసింహ గౌడ్, మొగుదాల రమేష్ గౌడ్, బొంగు జంగయ్య గౌడ్, ఉష్కాగుల రమేష్ గౌడ్, ఊడుగు శ్రీనివాస్ గౌడ్, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, వర్కాల రవి గౌడ్, సందగళ్ళ సతీష్ గౌడ్, ఊడుగు రమేష్ గౌడ్, ఊడుగు నరసింహ గౌడ్, చెరుకు లింగస్వామి గౌడ్, తొర్పునూరి రవి గౌడ్, తొర్పునూరి లింగస్వామి గౌడ్, మామిడి శివ, చెవగోని మహేష్ గౌడ్, కల్లెం నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి

* **జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్య కి వినతి టీబీజీకేఎస్ వినతి**

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని శనివారం ఇల్లందు టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్య కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల మీద , కార్మికులకు రావాల్సిన డిమాండ్స్ గురించి వివరించారు. సింగరేణిలో కారుణ్య నియామకాలను ఎత్తివేసే ప్రయత్నం చేస్తున్న గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ,ఎఐటియుసి , ఐఎన్టీయూసీ సంఘాలు , కార్మికులను మభ్యపెడుతూ మళ్లీ కార్మికులకులను మభ్యపెడుతూ చేసే ప్రయత్నం చేస్తున్నామంటూ కపట నాటకాలు ఆడుతు కార్మికులను కలుస్తున్న ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకులు.గతంలోనూ కారుణ్యా నియమకాలను ఎత్తివేసే విధంగా చేసిందన్నారు. ఈ సంఘాలే, తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల అనారోగ్యాలను దృష్టిలో పెట్టుకొని కారుణ్యా నియమాకాలను అమలు చేసిన ఘనత తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ బిఆర్ఎస్ పార్టీది అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ జాఫర్ హుస్సేన్, మరియు ముఖ్య అతిథిగా పాల్గొనా బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్, టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ మెంబర్ గిన్నారపు ఎంటెక్ మహేందర్ , బిఆర్ఎస్ నాయకులు , కడకంచి వీరస్వామి, రాచపల్లి శ్రీను , పాలడుగు రాజశేఖర్ ,తుంగ మహేష్ , నెమిలి నిఖిల్, శ్రీను, మ్మునిగంటి శివ , బజారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి గెలుస్తుందనే ఆక్రోశంతోనే రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

- **బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి**
- **కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ దిష్టిబొమ్మ దహనం**





ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: బీహార్‌లో బిజెపి గెలుస్తుందని ఆక్రోశంతోనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేస్తున్నారని బిజెపి మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ అన్నారు. బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో శనివారం ముస్తాబాద్ లో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీహార్ ఓటరు యాత్ర సభలో రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీ తల్లిని దూషించడాన్ని తీవ్రంగా ఖండిరచారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లిపై బీహార్‌లో రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అని అన్నారు. మున్ముందు ఇలాంటి వ్యాఖ్యలు మరిన్ని చేస్తే బీజేపీ కార్యకర్తలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. దేశంలో ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేద మధ్యతరగతి కుటుంబాలు అభివృద్ధి చెందాయని అన్నారు. ప్రపంచ దేశాలకే పెద్దన్నంగా వ్యవహరిస్తున్న మోదీని ప్రపంచ దేశాలే అత్యున్నత గౌరవ పురస్కారాలు అందిస్తుంటే ఇక్కడున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం విమర్శిస్తురని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రక్షణ ,ఆర్థిక అభివృద్ధి మోదీతోని సాధ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, కరెడ్ల మల్లారెడ్డి, రాయం రాజు, కోల కృష్ణ, కస్తూరి కార్తీక్ రెడ్డి, బాధ నరేష్, చీకోటి మహేష్, చిట్టినేని శ్రీనివాస్ రావు, మీస శంకర్, మీస శంకర్, నర్ర ప్రశాంత్ రెడ్డి, పెంజర్ల కళ్యాణ్, రాయం రాజు తదితరులున్నారు.

## విఘ్నేశ్వరస్వామికి సీఐ మన్మధ కుమార్ ప్రత్యేక పూజలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రక్కన శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాత్రికేయులు ప్రతిష్టించిన వినాయక విగ్రహం వద్ద చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్, ఎస్ఐ యాదగిరి, సీనియర్ పాత్రికేయులు దోనూరు రాంరెడ్డిలు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతుని పట్ల ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలన్నారు. అనంతరం పాత్రికేయులు సీఐ, ఎస్ఐలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

## మేడిపల్లి ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ లో వినాయక పూజలు



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక పూజలు శోభాయమానంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవింద్ రెడ్డి,ఫీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా అతిథులకు శాలువాతో సన్మానించారు.ఈ మేరకు వారు మాట్లాడుతూ వినాయకుని ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో శ్రేయస్సు నెలకొని, సమాజంలో ఐకమత్యం పెంపొందాలని ఆకాంక్షించారు. పూజలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలనూ చేపట్టాలని ప్రెస్ క్లబ్ ప్రతినిధులను పిలుపునిచ్చారు. సమాజానికి మేలు చేసే కార్యక్రమాలు,పర్యావరణ పరిరక్షణ, విద్యా సహాయం, రక్తదాన శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలను జర్నలిస్టులు ముందుండి నిర్వహిస్తే సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఆద్యక్షులు చిర్ర శ్రీధర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి వడ్డేమాను సుందర్ ,కోశాధికారి మరాటి మల్లేష్,ముఖ్య సలహదారులు వి సూర్యనారాయణ రెడ్డి,కల్మారి ఎల్లయ్య,క్లబ్ కమిటీ సభ్యులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అసమర్థతోనే యూరియా కొరత..

* వ్యవసాయాన్ని నిండా ముంచుతున్న కాంగ్రెస్ సర్కార్..
* కేసీఆర్ పాలనలో దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ..
* మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి..



అందోలు, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం అసమర్థతోనే యూరియా కొరత ఏర్పడిందని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి ఆరోపించారు. యూరియా కోసం తెల్లవారు జాము నుంచే యూరియా కేంద్రాల వద్ద పడిగాపులు పడుతూ ఇబ్బందులు పడుతున్న రైతాంగాన్ని చూసి ఆయన చలించిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలుకాని హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులకు ఎరువులను అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. యూరియా కోసం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తెల్లవారుజామునుంచే కిలోమీటర్ల కొద్ది లైన్లో నిలబడిన ఒక సంచి యూరియా దొరకని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పంటల దిగుబడి పై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. కనీస అవగాహన లేని ముఖ్యమంత్రి తెలంగాణకు ఉండడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు శనిలా దాపురించిందని విమర్శించారు. సమైక్య పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిన వ్యవసాయాన్ని పదేండ్ల తన పాలనలో లాభసాటిగా మార్చి దేశానికే తెలంగాణాను అన్నపూర్ణగా మార్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి దక్కుతుందన్నారు. టిఆర్ఎస్ పాలనలో సస్యశ్యామలంగా వెలుగొందిన తెలంగాణ రేవంత్ రెడ్డి మూర్ఖత్వంతో మళ్ళీ వెనుకంజలో పయనిస్తుందని తెలిపారు. రైతాంగం విషయంలో బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు అందిస్తుందని ప్రభుత్వం మెడలు వంచి రైతులకు ఎరువులు అందేలా చూస్తామన్నారు.

## మంచినీళ్లు సమృద్ధిగా ఉన్న బస్తీలో అమృత్ 2.0 ఎందుకు..?

* తెలంగాణ అర్బన్ డెవలప్మెంట్ ఫోరం (టీ యూ డి ఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ కొండపల్లి శ్రీధర్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మంచినీళ్లు సమృద్ధిగా ఉన్న బస్తీలో అమృత్ 2.0 ఎందుకని తెలంగాణ అర్బన్ డెవలప్మెంట్ ఫోరం (టీ యూ డి ఎఫ్ )భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ కొండపల్లి శ్రీధర్ అన్నారు. శనివారం కొత్తగూడెం కార్పొరేషన్ లో అమృత 2.0 కింద జరుగుతున్న మంచినీటి పైపులను నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీధర్ మాట్లాడుతూ ... సన్యాసి బస్తీ, బర్లీ ఫీట్ బస్తీలలో సింగరేణి సంస్థ అందించే నీరు బస్తీ వాసులకు అన్ని అవసరాలను తీరుస్తుందని తెలిపారు. ఇటీవల అమృత్ 2.0 స్కీం అటల్ మిషన్ ఫర్ రెజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ఫర్మేషన్ పేరుతో హడావిడిగా నాసిరకం పైప్ లైన్లు వేయటం జరుగుతుందన్నారు . ఈ స్కీంకు రూ. 120 కోట్ల కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. పనులు నిర్వహణ వద్ద అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడం విచారకరం. మరోపక్క ఇంటి యజమానుల నుంచి ఆస్తి పన్ను రసీదు, ఆధార్ కార్డు జిరాక్స్ ను అడిగి తీసుకుంటున్నారు. మరో పక్క కిన్నెరసాని వాటర్ సప్లై కూడా ఈ ప్రాంతంలో ఉంది. ఇది తరచూ లీకుల కారణంగా సరఫరాకు ఆటంకంగా ఉన్నది. అయినప్పటికీ ఇప్పుడు వేసే అమృత్ 2.0 కూడా కిన్నెరసాని మంచినీళ్లు అందించే పథకంగానే ఉంది వాపోయారు. మున్సిపాలిటీ నుంచి కొత్తగూడెం కార్పొరేషన్ గా అప్ గ్రేట్ అయినప్పటికీ పట్టణ వాసులకు మంచి నీటి సంక్షోభం తప్పడం లేదని విమర్శించారు. మొత్తం 29 డివిజన్లకు గాను రామవరం ప్రాంతం మినహా అన్ని డివిజన్లు వర్షా కాలంలో సైతం మంచి నీటి సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నారు. నీళ్లు ఉన్న చోటే పైప్ లైన్లు వేయటం అంటే గుట్టకు కట్టెలు మోసినట్టుగా ఉందని ఎద్దేవ చేశారు. నీటి సంక్షోభం ఉన్న డివిజన్లో యుద్ధ ప్రాతిపదిక మీద మంచినీరు అందించాలని, భవిష్యత్తులో లీకులు కాకుండా నాణ్యమైన పైపులు వేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో కూడా సింగరేణి సంస్థ వారు యధావిధిగా మంచినీరు అందించాలని కొండపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు.

## ఓటర్ లిస్టును మరోసారి విశ్లేషించాలని ఎంపీడీవోకు వినతి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మండల ఓటర్ లిస్టును మరోసారి విశ్లేషించి జాబితాను రూపొందించాలని కోరుతూ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్ శనివారం ఎంపీడీవో సందీప్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన ఓటర్ల జాబితా వార్డుల వారీగా విభజన సరైన పద్ధతిలో జరగలేదని పేర్కొన్నారు. విభజన ఏ పద్ధతి ప్రకారం చేశారు, ఏ ప్రతిపాదికగా విభజన చేశారో స్పష్టత లేదని ఆరోపించారు. కావున మరోసారి విశ్లేషించి జాబితాను రూపొందించాలని వినతిలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అల్మాస్ పేట కృష్ణ, ఉపాధ్యక్షుడు చిన్నంబాలరాజు కురుమ, మున్సిపాలిటీ యువత అధ్యక్షుడు మునుకుంట్ల నరసింహ గౌడ్ తదితరులున్నారు.

## కుషాయిగూడలో యువతి అదృశ్యం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైన ఘటన వెలుగులోకి వచ్చింది. బజంత్రీ అశోక్ ఫిర్యాదు మేరకు ఆయన చెల్లెలు బజంత్రీ రాధిక (20), ప్రైవేట్ ఉద్యోగి, ఆగస్టు 29న సాయంత్రం 5:40 గంటలకు మెడికల్ షాప్కు వెళ్తానని ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిరుద్యోగ గిరిజన యువత కు డీడీయూ జీకేవై పథకం కింద ఉచిత శిక్షణ

ప్రజాస్ఫూర్తి, మేడ్చల్ : తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖచే ట్రైకార్ ఎస్టీ కార్పొరేషన్, హైద్రాబాద్ ఆధ్వర్యంలో, గ్రామీణ ప్రాంత నిరుద్యోగ గిరిజన యువత కోసం డీడీయూ జీకేవై పథకం కింద ఉచిత శిక్షణ, వసతి సదుపాయాలతో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు క్రింది రంగాలలో 105 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వబడును. 1) అకౌంట్స్ అసిస్టెంట్ (టాలీ), అర్హత బి.కాం ఉత్తీర్ణత, 2) కంప్యూటర్ హార్డ్ వేర్ అసిస్టెంట్ అర్హత ఇంటర్ ఉత్తీర్ణత 3) ఆటోమొబైల్ 2 వీలర్ సర్వీసింగ్ అర్హత 10వ తరగతి ఉత్తీర్ణత 4) సోలార్ సిస్టమ్ ఇన్స్టలేషన్ అండ్ సర్వీస్ అర్హత 10వ తరగతి/ఐటీఐ ఉత్తీర్ణత ఇతర అర్హతలు 1) అభ్యర్థుల వయస్సు 15 నుండి 30 సంవత్సరాల మధ్య ఉండాలి 2) అభ్యర్థులు తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతానికి చెందినవారై ఉండాలి 3) చదువులు కొనసాగిస్తున్న వారు అర్హులు కారు తీసుకురావలసిన పత్రాలు 1) ఒరిజినల్ సర్టిఫికేట్లు మరియు జిరాక్స్ ప్రతులు 2) పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు 3) ఆధార్ కార్డ్ 4) రేషన్ కార్డ్ ఇంటర్వ్యూ స్థలం స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ, జలాల్ పూర్ (గ్రా), పోచంపల్లి (మండలం), యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ , అడ్మిషన్ చివరి తేదీ: 01092025 .ఈ అవకాశమును గిరిజన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, కె. పద్మజ,ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా వివరములకు , జనరల్ మేనేజర్, ట్రైకార్, హైదరాబాద్ సంప్రదించగలరు.



## ప్రధాని మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య

* బిజెపి మండల పట్టణ అధ్యక్షులు పూజారి కుమారస్వామి గౌడ్

ఆలేరు, ప్రజా స్ఫూర్తి : దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తల్లి పై బీహార్ లో రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అని బిజెపి మండల పట్టణ అధ్యక్షులు పూజారి కుమారస్వామి గౌడ్ నంద గంగేష్ లు అన్నారు. ప్రధాని మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను నిరసన తెలుపుతూ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ ను బిజెపి మండల పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆలేరు రైల్వే గేట్ వద్ద దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే బీహార్ ఎన్నికల్లో బిజెపి గెలుస్తదని ఆక్రోషంతో అనుచిత వాక్యాలు చేశాడని ముమ్ముందు ఇలాంటి చర్యలకు పాల్పడితే బీజేపీ కార్యకర్తలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. దేశంలో ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేద మధ్యతరగతి కుటుంబాలు అభివృద్ధి చెందాయని అన్నారు. ప్రపంచ దేశాలకే పెద్దన్నంగా వ్యవహరిస్తున్న మోదీ నీ ప్రపంచ దేశాలే అత్యున్నత గౌరవ పురస్కారాలు అందిస్తుంటే ఇక్కడున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం విమర్శిస్తురని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రక్షణ ,ఆర్థిక అభివృద్ధి మోదీ తోని సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కామిటికార్ కృష్ణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్డేమాన్ నరేందర్, పట్టణ మండల ప్రధాన కార్యదర్శిలు ఎలగల వెంకటేష్, సుంకరి సృజన్ కుమార్ గౌడ్, శేషత్వ అమరేందర్, సీనియర్ నాయకులు పసుపునురి వీరేశం ఎలగందుల సురేష్ సముద్రాల శ్రీనివాస్ బందెల సుభాష్ పూల హనుమంతు సుక్కరాజు బైరి మహేంద్ర గౌడ్ వడ్డేపల్లి కిషన్ గాజుల సారయ్య గుర్రం నరసింహులు దూడల అజయ్ మధు రవి తదితరులు పాల్గొన్నారు.



## పాత కొత్తగూడెం ప్రాథమిక హెల్త్ సెంటర్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలి

* సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పాత కొత్తగూడెం ప్రాథమిక హెల్త్ సెంటర్ లో గల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. పాత కొత్తగూడెంలో గల ప్రాథమిక హెల్త్ సెంటర్లో ఉన్న సమస్యలు సిపిఎం బృందం అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ హాస్పిటల్లో ఇద్దరు నర్సులు అవసరం ఉండగా ఒక్కరు మాత్రమే పనిచేస్తున్నారని, స్వీపర్ రిటైర్ అయ్యారని కొత్త స్వీపర్ పోస్టు ఇంకా మంజూరు కాలేదని తెలియజేశారు. అలాగే మినరల్ ఆర్వో వాటర్ ప్లాంట్ రిపేర్ లో ఉన్న పట్టించుకోవడంలేదని, డ్రగ్స్ స్టోర్ రూమ్ వర్షం వస్తే కురుస్తుందని దీనివలన మెడిసిన్ తడిసే ప్రమాదం ఉందని అన్నారు. హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ ద్వారా రావలసిన నిధులు రెండు సంవత్సరాల నుండి రాకపోవడం వలన హాస్పిటల్ అభివృద్ధి పనులు జరగడంలేదని, కనీసం ప్రహరీ గోడ కూలిపోతే నిర్మించడానికి కూడా డబ్బులు లేని దుస్థితి ఉందని ఆరోపించారు. ప్రహరీ గోడ లేకపోవడం వలన కుక్కలు పందులు పశువులు స్వైర విహారం చేస్తున్నాయని దీనివలన హాస్పిటల్ కి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్పిటల్ సాయంత్రం నాలుగు గంటల వరకే ఉంటుందని తర్వాత పాత కొత్తగూడెం రెండు వార్డుల ప్రజలకు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చిన మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్ద ఆసుపత్రికి రావాల్సిందేనని అన్నారు అందుకని హాస్పిటల్లో 24 గంటలు వైద్య సదుపాయం అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి హాస్పిటల్ మరమ్మత్తులు చేయించాలని ఆర్వో వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయించాలని సీజనల్ వ్యాధులనుండి ప్రజలను కాపాడడానికి మెరుగైన వైద్య సదుపాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్యా అభిమన్యు టౌన్ కమిటీ సభ్యులు మంద నాగకృష్ణ నాయకులు కుక్కల ముత్తేష్ షాహెబీ జబ్బ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## చేసిన సేవలే గుర్తింపునిస్తాయి...

* జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు...
* ఘనంగా గోవింద్ రెడ్డి పదవి విరమణ అభినందన సభ



అందోలు, ప్రజాస్ఫూర్తి: ఉద్యోగులకు చేసిన సేవలతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండల విద్యాధికారి, పోతుల బొగుడ ఉన్నత పాఠశాల హెచ్ఎం గడ్డం గోవింద్ రెడ్డి పదవి విరమణ అభినందన సభను శనివారం పోతులబోగుడా లో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి,. పదవి విరమణ పొందుతున్న గోవింద్ రెడ్డి దంపతులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు, టిపిటిఎఫ్ యూనియన్ నాయకులు, కుటుంబ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పాల్గొని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవింద్ రెడ్డి విద్యార్థి దశ నుంచే సామాజిక చైతన్యంతో అంకురిత దీక్ష దక్షలతో క్రమశిక్షణా మరియు నిబద్ధతతో విద్యా సేవలో పునీతులై 36 సంవత్సరాల పాటు విధినిర్వాహణలో అలుపెరుగని చేశాడని కొనియాడారు. ఉపాధ్యాయ విధి నిర్వహణలో ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాడన్నారు. ఎటువంటి మచ్చ లేకుండా ఉపాధ్యాయ వృత్తి నుండి పదవి విరమణ పొందడం గొప్పతనం అన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ బాలయ్య, సిర్గాపూర్ మండల ఎంఈఓ శ్రీనివాస్, విశ్రాంత ఉపాధ్యాయులు భూమయ్య, మాజీ సర్పంచ్ సంగిశెట్టి, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ వీరన్నతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతులు ఆందోళన వద్దు



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : దశలవారీగా రైతులందరికీ అవసరమైన యూరియా తప్పక పంపిణీ చేయడం జరుగుతుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయాధికారిని పద్మజ అన్నారు. రెండు రోజులకోసారి రాజపేటకు యూరియా బస్తాలు వస్తాయని, రైతులు ఒకటి లేక రెండు బస్తాలు పట్టా పాస్ పుస్తకం జిరాక్స్ ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తీసుకోవాలన్నారు. అవసరమైతే రైతులు మరో మారు వచ్చి యూరియా బస్తాలు తీసుకెళ్లాలని ఏవో కోరారు.

## గణనాథుడికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక పూజలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ పరిధిలోని ఏర్పాటు చేసిన పలు వినాయకుని అన్నదాన , నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి , నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, ఎన్ఎంసీ మహిళ అధ్యక్షురాలు ఇందిరా కడియాల, ఎన్ఎంసీ జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి , సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పలు కమిటీ వాసులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన వీడ్కోలు

* **పదవీ విరమణ పొందిన ప్రభుదయాళ్‌కు సత్కారం**
* **ఉపాధ్యాయ వృత్తికే తలమానికంగా నిలిచిన ఘనుడు**
* **ప్రశంసలతో ముంచెత్తిన అతిథులు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: హాస్టల్ వార్డెన్‌గా తన వృత్తిని ఆరంభించిన డాక్టర్ మారుముడి ప్రభుదయాళ్ అనతికాలంలోనే గ్రేడ్ స్కూల్ అసిస్టెంట్‌గా నియమితులై 1993లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి, రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా, మండల విద్యాధికారిగా శనివారం పదవీ విరమణ పొందారు. కేవలం పాఠాలు బోధించడమే తన వృత్తిగా భావించకుండా సమాజంలో నేనూ ఒక భాగమేనంటూ తన వంతుగా అనేకానేక సేవా కార్యక్రమాలు నిర్వహించి తన పేరును సార్థకం చేసుకున్నారు ప్రభు'దయాళ్'. ఆయన ఎక్కడ విధులు నిర్వహించినా, వృత్తి ధర్మంతోపాటు ఆయా ప్రభుత్వ పాఠశాలలు కూడా ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడే విధంగా సౌకర్యాలు కల్పించేందుకు విశేష కృషి చేశారు. అదేవిధంగా ఎందరో విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించి వారి ఉన్నతికి తోడ్పాటునందించారు. భద్రాచలం నందు తొలి గిరిజన బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆయన చేసిన సేవలను గుర్తించి ఢిల్లీకి చెందిన ఇగ్నో సంస్థ స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం, మేదరబస్తీ నందు ప్రభుత్వ పాఠశాల గెజిటెడ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన కాలంలో 10వ తరగతి నందు రెండు సార్లు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడం, రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బదిలీ అయిన అనంతరం ఆ పాఠశాల స్వరూపాన్నే మార్చి ఎంతో గుర్తింపు పొందిన ప్రభుదయాళ్‌ను ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక జీవో ద్వారా ఆయనను ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపిక చేసి సన్మానించడం ఆయన కార్యదక్షతకు నిదర్శనం. జ్యూవెల్ ఆఫ్ ఇండియా, బెస్ట్ ఎడ్యుకేటర్, బెస్ట్ ఆఫీసర్, బెస్ట్ ప్రిన్సిపాల్ వంటి సత్కారాలు ఆయన మకుటంలోచేరి మరింత వన్నెతెచ్చాయి.



* **ప్రభుదయాళ్‌కు ఘన సత్కారం**

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ప్రభుదయాళ్ ఎంతో సాదాసీదాగా ఉంటారు. ఆయన పదవీ విరమణను సైతం సాదాసీదాగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కాని ఆయన ద్వారా లబ్ధి పొందిన పూర్వ విద్యార్థులు, స్థానికులు కలిసి ప్రభుదయాళ్ పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు అతిథులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు అనే పదానికి ఉదాహరణ ప్రభుదయాళ్ అని ప్రశంసించారు. తన సేవాగుణంతో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని, ప్రభుత్వ విద్య పట్ల ప్రజల్లో నమ్మకం కలిగించారని కొనియాడారు. అనంతరం ప్రభుదయాళ్ మాట్లాడుతూ తన విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బండి సుబ్బారావు, లక్ష్మీ మొగిలేశ్వరి, అనిత, జ్యోతి, భరత్ కుమార్, శ్రీనివాస్ రావు, శంకర్, ప్రసాద్, నరేష్, మిట్టు, నరసింహారావు, భాస్కర్, ఇందిరా, రాజు, మధుసూదన్ రావు, నాగేష్, ధర్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పదవి శాశ్వతం కాదు.. మరణించే సేవ చేసే గుణం మారదు

- **పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేయడం అభినందనీయం**
- **మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే పదవి అనేది శాశ్వతం కాదని.. కానీ తన వ్యక్తిత్వం, సేవ చేయాలని గుణం మాత్రం మరణించేవరకు మారకుండా శాశ్వతంగా ఉంటుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం జయశ్రీ ఫంక్షన్ హాల్ లో పారిశుద్ధ్య కార్మికులకు, సిబ్బందికి ఆర్ కె హాస్పిటల్, కామినేని హాస్పిటల్, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరై, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ చౌటుప్పల్ మున్సిపాలిటీ ప్రజలను కంటికి రెప్పల కాపాడుతూ, మున్సిపల్ పరిధి మొత్తం శుభ్రపరచడంలో ముఖ్యపాత్ర పోషించి వారి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న కార్మికులకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం మొట్టమొదటిసారిగా చూస్తున్నానన్నారు. ప్రభుత్వమే అన్ని చేయాలంటే కుదరకపోవచ్చని, ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ తోటి సామాజిక కార్యక్రమాలు చేయాలని సూచించారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఉచిత వైద్య శిబిరంను నిర్వహించిన వైద్య బృందాన్ని, మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రాంరెడ్డిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, తహసిల్దార్ వీరాబాయి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, ఆర్పీలు, నాయకులు పాల్గొన్నారు.

## రచయితగా మారిన విజిలెన్స్ డీజీ




పోలీస్ శాఖలో 31 సంవత్సరాలు వివిధ హోదాలలో ఐపీఎస్‌గా సేవలందించిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డీజీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి రచయితగా కొత్త బాట పట్టారు. పుంజుతోక పేరిట పుస్తకాన్ని రచించారు. 1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కొత్తకోట శ్రీనివాసరెడ్డి తాను పనిచేసిన ప్రాంతాలలో స్వీయ అనుభవాలు, అక్కడి పరిస్థితులపై పుస్తక రూపంలో వెల్లడించారు. విధి నిర్వహణలో తన దైన శైలిని, సమాజంలోని రుగ్మతలు, మానవ సంబంధాల పట్ల స్పందిస్తూ అక్షర రూపం ఇచ్చారు. ఆయన రచించిన పుంజు తోకలో వీర,శాంత, రౌద్ర, అద్భుత, కరుణ, హాస్య, భీభత్స తదితర అంశాలను ప్రస్తావించారు. పుంజుతోక(కాక్టయిల్) లో 120 అంశాలపై కవితలు రచించారు. విధి నిర్వహణలో ముక్కుసూటిగా కొనసాగిన కొత్తకోట శ్రీనివాసరెడ్డి రచనా రంగంలోనూ తనదైన శైలిలో పదునైన పదాలను ప్రయోగించారు.

## సెప్టెంబరు 18 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు: స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: తిరుపతిలో సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో మీడియాకు విడుదల చేసిన వీడియోలో ఈ వివరాలు వెల్లడించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల పరిధిలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన సుమారు 300 మంది మహిళా ఎమ్మెల్యేలు సదస్సుకు హాజరు కానున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి తొలిరోజు సీఎం చంద్రబాబు, లోక్‌సభ స్పీకర్ హాజరవుతారని, ముగింపు రోజున గవర్నర్ హాజరుకానున్నారని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. సదస్సుకు హాజరయ్యే ఎమ్మెల్యేలకు శ్రీవారి దర్శనం కల్పించించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.




## పదవీ విరమణ పొందిన ఆరుగురు పోలీసు అధికారులను ఘన సత్కారం

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి శనిపదవీ విరమణ పొందిన ముగ్గురు ఎస్ఐలు,ఇద్దరు ఏఎస్సైలు ఒక హెడ్ కానిస్టేబుల్ శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హేమచంద్రాపురం లోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాల్ నందు ఘనంగా సత్కరించారు. కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఖాజా మక్సుద్ అలీ ఖాన్, అశ్వాపురం స్టేషన్ నందు ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న కొత్తా నాగేశ్వరరావు, లక్ష్మిదేవిపల్లి పోలీస్ స్టేషన్ నందు ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న మందపల్లి ప్రసాద్ రావు,జూలూరుపాడు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ కుక్కమళ్ళ కోటేశ్వరరావు,ఇల్లందు పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న చిన్నధనపాల్ రవి,మరియు ములకలపల్లి పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు కన్నిడి వెంకటేశ్వర్లు శనివారం పదవీ విరమణ పొందడం జరిగింది.పదవీ విరమణ పొందిన ఈ ఆరుగురు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శాలువాలతో మరియు పూలమాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం పోలీస్ శాఖలో వీరి అనుభవాలను జిల్లా ఎస్పీ తో పంచుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు.సుమారు 40 ఏళ్ల పైన పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన అధికారుల అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలో భర్తీ అయిన అధికారులు సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. పోలీసు శాఖ నుండి పదవీ విరమణ పొందిన అధికారులు , సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.తమ దైనందిన కార్యక్రమాలలో వ్యాయామం,యోగా,ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అనంతరం పదవీ విరమణ పొందిన ఆరుగురు అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి,ఏఓ మంజ్యా నాయక్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు,లక్ష్మిదేవిపల్లి ఎస్సై రమణా రెడ్డి,ఎంటిఓ సుధాకర్,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు , జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.




## తిరుపతిలో బీకేసీఏ జట్టు ఘన విజయం

* **అంతర్రాష్ట్ర "అండర్–17" క్రికెట్ ట్రోఫీ బీకేసీఏ జట్టుకే**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి-తిరుమలగుంట కేవీఎస్ టీ గ్రౌండ్ వేదికగా గత నాలుగు రోజులుగా జరిగిన అండర్-17 ఇంటర్ స్టేట్ టోర్నమెంట్-2025లో భద్రాద్రి కొత్తగూడెం క్రికెట్ అకాడమీ (బీకేసీఏ-17) జట్టు విజేతగా నిలిచింది.

**ఫైనల్స్ లో బీకేసీఏ జట్టు ఘనవిజయం**

ఫైనల్ మ్యాచ్‌లో వెస్ట్ గోదావరి జిల్లా బాలాజీ క్రికెట్ కోచింగ్ (బీసీసీ) జట్టుతో తలపడిన బీకేసీఏ జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. టాస్ ఓడి బ్యాటింగ్ మొదలుపెట్టిన బీసీసీ జట్టు 20 ఓవర్లలో కేవలం 87 పరుగులకు ఆలౌట్ అయింది. బీసీసీ తరపున విఘ్నేష్ (34 పరుగులు), దత్త శివరాం (23 పరుగులు) మాత్రమే కొంతకాలం క్రీజులో నిలిచారు.బీకేసీఏ బౌలర్ అబుల్ కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేసి 4 ఓవర్లలో 15 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు.తర్వాత బ్యాటింగ్‌కు దిగిన బీకేసీఏ జట్టు 88 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా చేధించింది.ఓపెనర్లు గౌతంరెడ్డి, అబుల్ స్వల్ప స్కోర్ చేసినా ఫస్ట్ డౌన్‌లో వచ్చిన సాయి సాకేత్ (అద్భుత బ్యాటింగ్), థర్డ్ డౌన్‌లో వచ్చిన గణేష్ కీలక భాగస్వామ్యం కట్టి మ్యాచ్‌ను కట్టిపడేశారు. చివరికి బీకేసీఏ జట్టు 14 ఓవర్లలో 88/3 స్కోర్‌తో విజేతగా నిలిచింది.

**వ్యక్తిగత అవార్డులు**

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్: అబుల్ (బీకేసీఏ) - 3 వికెట్లు, అద్భుత బౌలింగ్

బెస్ట్ బౌలర్: అబుల్ (బీకేసీఏ)

బెస్ట్ బ్యాటర్: విఘ్నేష్ (బీసీసీ) - 39 బంతుల్లో 34 పరుగులు

**వెల్లువెత్తిన అభినందనలు**

ఫైనల్ పోటీ అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో టోర్నమెంట్ నిర్వాహకులు - 50 బాల్స్ క్రికెట్ అకాడమీ ఏపీ జనరల్ సెక్రటరీ జి. ఆనంద్ బాబు, సహాయ కార్యదర్శి టి. మణికంఠ, బి సౌత్ జోన్ హెడ్ చెన్న ప్రసాద్, ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎస్. రవిబాబు విజేతలు, రన్నర్స్ జట్లను అభినందించారు.

ఈ సందర్భంగా బీకేసీఏ కోచ్ పంతంగి సాయి నిరంజన్ మాట్లాడుతూ -

"మా జట్టు ఆటగాళ్లు క్రమశిక్షణతో, అంకితభావంతో ఆడి ఈ ట్రోఫీని సాధించారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయిలో రాణించేలా శిక్షణ ఇస్తాం" అని ఆనందం వ్యక్తం చేశారు. ఆయన వెంట మార్గం నరేందర్, కదిరి నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎడారిని తలపిస్తున్న కన్నాపూర్ చెరువు



కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. గత మూడు రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు లింగంపేట్ మండలం కన్నాపూర్ గ్రామంలోని చెరువు కట్ట తెగిపోయింది. దీంతో కన్నాపూర్ చెరువు ఎడారిని తలపిస్తోంది. గ్రామంలోని 500 ఎకరాల పెద్ద చెరువు కట్ట తెగిపోవడంతో అందులోని నీళ్లన్నీ పంట పొలాల్లోకి ప్రవహించాయి. దీంతో పొలాలు పూర్తిగా ఇసుకతో కప్పబడి వాగును తలపిస్తున్నాయి. వరద దాటికి ప్రధాన రహదారి బ్రిడ్జి సైతం కూలిపోవడంతో ప్రజలు ప్రాణాలను అరిచేతుల్లో పెట్టుకుని గడుపుతున్నారు. వర్ష బీభత్సంతో గ్రామంలోని 15 ఇళ్లు కూలిపోవడంతో తీవ్ర నష్టం జరిగిందని చెబుతున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. నిజ్జన రమేష్ మీడియా సమావేశంలో వెల్లడించారు. జిల్లా కలెక్టర్ గ్రామానికి వస్తే స్థానిక సమస్యలు తెలుస్తాయని అన్నారు. గ్రామానికి బ్రిడ్జి తెగిపోవడం వల్ల రాకపోకలు బంద్ అయ్యాయని చెప్పారు. వెంటనే చెరువు కట్టను నిర్మించాలని, అధికారులు త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు. కట్ట పనులు త్వరగా పూర్తి చేస్తేనే రాబోయే వర్షాలకు చెరువులో నీరు నిలుస్తుందని అన్నారు. లేదంటే రైతులు రెండు పంటలను నష్టపోతారని తెలిపారు. అంతే కాకుండా గ్రామానికి స్పెషల్ ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు నిజ్జన విట్టల్, స్థానికులు కాశీరం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గోదావరి.. బాసర ఆలయం వరకు వరద నీరు



ఆదిలాబాద్: నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులుగా వరద పెరగడంతో గోదావరి నుంచి సరస్వతి ఆలయం వరకు ప్రధాన రహదారి జలమయమైంది. వరదనీరు వ్యాసమహర్షి ఆలయానికి, ఆలయ ఆవరణలోని తితిదే గృహాల వరకు చేరుకుంది. ఆలయం వద్ద దుకాణాలు, ప్రైవేటు లాడ్జిలు, సత్రాలన్నీ నీట మునిగాయి. గంగాదేవి, సూర్యేశ్వర శివాలయం, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్‌లు జలమయమయ్యాయి. అక్షర కాలనీలో చిక్కుకున్నవారిని ట్రాక్టర్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్థానిక నాగభూషణ్ విద్యాలయంలో 30 మంది విద్యార్థులు, ఆరుగురు టీచర్లు చిక్కుకున్నారు. వరద చుట్టుముట్టడంతో భవనం పై అంతస్తుకు వెళ్లి తలదాచుకున్నారు. వారిని బయటకు తీసుకొచ్చేందుకు వెళ్లి మరో 8 మంది కూడా వరదనీటిలో చిక్కుకున్నారు.

## అల్లు కనకరత్నం నేత్రదానం ఎందరికో స్ఫూర్తి దాయకం: చిరంజీవి



హైదరాబాద్: సినీ నిర్మాత అల్లు అరవింద్ మాతృమూర్తి కనకరత్నం వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ ఈ రోజు తెల్లవారుజామున కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆమె బతికి ఉన్న సమయంలోనే చిరంజీవి చేపట్టిన బ్లడ్, ఐ డొనేషన్ వంటి కార్యక్రమాలకు ప్రభావితులయ్యారు. తాను మరణించిన తర్వాత తన కళ్లను దానం చేయాలని కుటుంబ సభ్యులకు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆమె మరణించిన తర్వాత కళ్లను అల్లు కుటుంబం దానం చేసింది. ఈ విషయాన్ని చిరంజీవితాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో తెలిపారు. ఆమె నేత్ర దానం ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అవయవదానంలో నేత్రదానం మహా గొప్పదని చిరంజీవి అన్నారు.



# తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. నాలుగైదు రోజుల పాటు ఈ సమావేశాలు నిర్వహించే అవకాశాలున్నాయి. నూతనంగా ఎన్నికైన శాసనమండలి సభ్యులను మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభకు పరిచయం చేశారు. మరోవైపు ఇటీవల మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపట్ల సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. విద్యార్థి రాజకీయాల్లో గోపీనాథ్ చురుగ్గా ఉండేవారని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేశారని, ఎన్టీఆర్‌కు విశ్వాసపాత్రుడిగా గోపీనాథ్‌కు సత్సంబంధాలు ఉండేవన్నారు. విద్యార్థి నేతగా, ప్రజాప్రతినిధిగా, సినీ నిర్మాతగా రాణించారని చెప్పారు. గోపీనాథ్ తనకు మంచి మిత్రుడని, సన్నిహితుడని గుర్తు చేసుకున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్సీలు రత్నాకర్, రంగారెడ్డి మృతిపట్ల మండలిలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాలపై చర్చ అనంతరం సమావేశాలు వాయిదా పడతాయి. అసెంబ్లీ, మండలిలో వేర్వేరుగా నిర్వహించనున్న బీఏసీ సమావేశాల్లో ఎన్ని రోజుల పాటు సభలను నిర్వహించాలనే దానిపై తుది నిర్ణయం తీసుకుంటారు. డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కూడా ఈ సమావేశాల్లోనే నిర్వహించే వీలుంది.



# త్వరలో యూనిఫైడ్ బిల్డింగ్ రూల్స్.. నోడల్ ఏజెన్సీగా హెచ్ఎండీఏ



మున్సిపల్ కార్పొరేషన్స్, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, అర్బన్ డెవలప్ మెంట్ ఆథారిటీలు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలకు సంబంధించిన నిబంధనలు ఒకే విధంగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకుగాను యూనిఫైడ్ బిల్డింగ్స్ రూల్స్ రూపొందించేందుకు హెచ్ఎండీఏను నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే కన్సల్టెన్సీ కోసం హెచ్ఎండీఏ ఆహ్వానించిన టెండర్‌ను 'ఈ అండ్ వై' అనే సంస్థ దక్కించుకున్నది. ఈ సంస్థకు ఇంతకుముందు గుజరాత్, మహారాష్ట్రల్లో యూనిఫైడ్ రూల్స్ తయారు చేసిన అనుభవం ఉన్నది. దీంతోపాటు అనేక అంతర్జాతీయ నగరాల్లోనూ బిల్డింగ్ రూల్స్ రూపొందించింది. అయితే రాష్ట్రంలో బిల్డింగ్స్ రూల్స్, ఇతర మార్గదర్శకాలను అన్నింటిని కలిపి యూనిఫైడ్ బిల్డింగ్ రూల్స్ రూపకల్పనకు సంబంధించిన పనులను 'ఈ అండ్ వై' సంస్థ రూపొందించనుంది.

# ములుగు ఎస్పీ ఎదుట లొంగిపోయిన ఏడుగురు మావోయిస్టులు

ములుగు క్రైం: ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ సమక్షంలో శనివారం నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఏడుగురు సభ్యులు లొంగిపోయారు. జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం సంయుక్తంగా "పోరు కన్నా ఊరు మిన్న మన ఊరికి తిరిగి రండి" పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న పునరావాస సదుపాయాల గురించి వివరిస్తున్నారు. వీటి గురించి తెలుసుకున్న నిషేధిత మావోయిస్టు పార్టీలో వివిధ హోదాలలో పనిచేస్తోన్న నలుగురు మహిళలు సహా ఏడుగురు సభ్యులు నక్సలిజాన్ని విడిచిపెట్టి ప్రశాంతమైన జీవితం గడపాలనే ఉద్దేశంతో ఎస్పీ ఎదుట లొంగిపోయారు. వీరిలో ఏరియా కమిటీ సభ్యుడు తాటి ఉంగి, ముగ్గురు పార్టీ సభ్యులు కొడ్మే సుక్కు, పోడి భీమ్, కుంజం వరలక్ష్మి, పద్మం మరో ఇద్దరు ఉన్నారు.

# రవీంద్రభారతిలో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ.. హాజరైన ప్రముఖులు




హైదరాబాద్: రవీంద్రభారతిలో సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రొఫెసర్ హరగోపాల్, గుమ్మడి నర్సయ్య పాల్గొన్నారు.

*** సురవరం ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారు: విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ**

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సురవరం సుధాకర్‌రెడ్డి పనిచేశారని విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. వారి ఇబ్బందులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నివేదికలు ఇచ్చారని గుర్తుచేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. తనకు కూడా వామపక్ష భావజాలం పట్ల అభిమానం ఉందని పేర్కొన్నారు. సురవరం ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారని కొనియాడారు.

*** సురవరం సుధాకర్‌రెడ్డి జీవితం ఒక పాఠం: డి.రాజా**

నిస్వార్థంగా ప్రజల కోసమే జీవించడం ఎలాగో సురవరం సుధాకర్‌రెడ్డి జీవితాన్ని చూస్తే అర్థమవుతుందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ప్రతి రాజకీయ నాయకుడికి ఆయన జీవితం ఒక పాఠంగా నిలుస్తుందని చెప్పారు. సురవరం పాటించిన సిద్ధాంతాలు సీపీఐ మాత్రమే కాదు.. అన్ని పార్టీల నేతలకు ఆదర్శవంతమన్నారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటమే కాదు.. ప్రజల స్వేచ్ఛ కోసం పోరాటాలు చేయాలని ఆయన భావించారు.

*** సురవరం గొప్ప ప్రజాస్వామికవాది: బీవీ రాఘవులు**

దశాబ్దానికిపైగా సురవరం, తాను కలిసి కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లినట్లు బీవీ రాఘవులు తెలిపారు. అనేక పోరాటాలు, ఉద్యమాల్లో కలిసి పని చేసినట్లు వివరించారు. సురవరం గొప్ప ప్రజాస్వామిక వాది అని కొనియాడారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కమ్యూనిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

*** నిబద్ధతతో కూడిన రాజకీయాలు చేశారు: మహేశ్‌కుమార్ గౌడ్**

తాను ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా ఉన్నప్పుడు తొలిసారి సురవరం సుధాకర్‌రెడ్డిని కలిసినట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఇటీవల సీపీఐ రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవంలో మళ్లీ కలిసినట్లు చెప్పారు. కమ్యూనిజం ఎప్పుడూ సజీవంగా ఉంటుందన్నారు. సురవరం నిబద్ధతతో రాజకీయాలు నడిపారన్నారు. ఆయన జీవితం ఎంతో మందికి ఆదర్శమని పేర్కొన్నారు.

# గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా కోదండరామ్, అజారుద్దీన్: కేబినెట్ నిర్ణయం





హైదరాబాద్: తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్‌ను ఎంపిక చేయాలని కేబినెట్ నిర్ణయించింది. గతంలో సిఫార్సు చేసిన అమేర్ అలీఖాన్ స్థానంలో అజారుద్దీన్‌కు చోటు లభించింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈమేరకు కేబినెట్‌లో తీర్మానించి గవర్నర్‌కు పంపింది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు ఎదురు చూస్తున్న అజారుద్దీన్‌ను అనూహ్యంగా ప్రభుత్వం.. ఎమ్మెల్సీగా ఎంపిక చేసింది.

# గత ప్రభుత్వంలో లేని పీపీటీ సంప్రదాయం.. ఇప్పుడెందుకు?: భట్టి విక్రమార్క



హైదరాబాద్: ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్(పీపీటీ) ఇచ్చే సంప్రదాయం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. భారత రాష్ట్ర సమితి హయాంలో తాము పీపీటీకి అవకాశం ఇవ్వాలని లేఖ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అప్పుడు తమకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. అప్పుడు లేని సంప్రదాయం ఇప్పుడు ఎలా ఉంటుందన్నారు. ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కట్టట్లేదనే భారత రాష్ట్ర సమితి వాదన సరికాదని పేర్కొన్నారు. మరి వడ్డీలు ఆ పార్టీ నేతలు కడుతున్నారా అని ప్రశ్నించారు. మరోవైపు శాసనసభలో కాళేశ్వరంపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణ CM సహాయనిధికి బాలకృష్ణ భారీ విరాళం



నటసింహం నందమూరి బాలకృష్ణ మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారు. తెలంగాణ వరద బాధితులకు భారీ ఆర్థికసాయం చేశారు. ఈ మేరకు తెలంగాణ సీఎం సహాయనిధికి బాలకృష్ణ రూ.50 లక్షల విరాళం ప్రకటించారు. కాగా, ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు ఉత్తర తెలంగాణను ముంచెత్తాయి. ఈ భారీ వర్షాల వల్ల 10 మంది వరకు చనిపోయి ఉండొచ్చని తెలంగాణ డీజీపీ జితేందర్ అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు వరదల్లో చిక్కుకున్న దాదాపు 2వేల మందిని రక్షించినట్టు చెప్పారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఆర్మీ సాయంతో రెండు హెలికాప్టర్ల ద్వారా బాధితులను రక్షించినట్టు డీజీపీ వివరించారు. సహాయక చర్యల కోసం డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

# రేవంత్ సర్కార్ మరోసారి బీసీలను వంచిస్తోంది : ఎమ్మెల్సీ కవిత



రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరోసారి బీసీలను వంచిస్తోందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ చట్ట సవరణ చేస్తున్నామని చెప్పడం అంటే సాంకేతిక అంశాలను అడ్డం పెట్టుకొని బీసీలకు రిజర్వేషన్ల పెంపు ఫలాలు దక్కకుండా చేయడమే అని విమర్శించారు. "మేం రిజర్వేషన్లను పెంచాం.. కోర్టు కొట్టేసింది.." అనే నెపం వెతుక్కునే ప్రయత్నాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నట్టు ప్రతి ఒక్కరికీ అర్థమవుతున్నదని అన్నారు. అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు చట్టరూపం దాల్చేలా ప్రధానిపై ఒత్తిడి తేవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనీస ప్రయత్నాలు చేయలేదని ఆరోపించారు. ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లలేదని, కేబినెట్ తీర్మానంపై ఆర్డినెన్స్ ఇచ్చేలా గవర్నర్ ను కలిసి డిమాండ్ చేయలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, గవర్నర్ బీసీల రిజర్వేషన్ల పెంపును తొక్కిపెట్టినా సుప్రీం కోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేయలేదని మండిపడ్డారు.

# అప్పుడే జూబ్లీహిల్స్ ఎన్నికలకు వెళ్లాలి.. కాంగ్రెస్ సర్కార్‌కు కిషన్ రెడ్డి సూచన



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తరహాలోనే రేవంత్ రెడ్డి పాలన సాగుతోందన్నారు. అక్టోబర్ లేదా నవంబర్‌లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగనుందని చెప్పారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు.. తప్పకుండా బీజేపీకే అవకాశం ఇవ్వాలని చూస్తున్నారని అన్నారు. బీసీల ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు లేదని అన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేశాకే జూబ్లీహిల్స్ ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అంతకుముందు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కి బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సీలింగ్ ఎత్తివేతపై అవగాహన లేకుండా ముందుకెళ్తోందని మండిపడ్డారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు పరిగణనలోకి తీసుకోలేదు. హైకోర్టు డెడ్‌లైన్‌తో హడావుడిగా నిర్ణయం తీసుకున్నారని ఎద్దేవా చేశారు. ఇది లీగల్‌గా నిలబడే అవకాశం లేదని రఘునందన్‌రావు అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు అవగాహన లేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శలు చేశారు. ప్రత్యేక జీవోలతో బీసీ రిజర్వేషన్లు సాధ్యం కాదని అన్నారు. లీగల్‌గా వచ్చే అడ్డంకులకు కాంగ్రెస్‌దే బాధ్యత అని చెప్పారు. ముస్లింలను జతచేసి బీసీ రిజర్వేషన్లంటే ఎలా సాధ్యం అని అనుమానం వ్యక్తం చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

## సెప్టెంబర్‌లో సగం రోజులు బ్యాంకులు బంద్..




**న్యూఢిల్లీ:** కస్టమర్లకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రతి నెలా బ్యాంకు సెలవుల జాబితాను ముందుగానే జారీ చేస్తుంది. అందుకు తగ్గట్టుగానే సెప్టెంబర్ నెలకు సంబంధించిన సెలవుల జాబితా కూడా తాజాగా విడుదలైంది. కాగా, ఆ నెలలో పండుగలు, వారాంతాలతో కలిపి సగం రోజులు బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. అయితే ఆర్‌బీఐ సెలవుల జాబితాలోని బ్యాంకు సెలవులు అన్ని రాష్ట్రాలకు వర్తించవు. ఆయా ప్రాంతీయ వేడుకలు, పండుగల ప్రకారం సెలవులు ఇస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని బ్యాంకులకు పబ్లిక్ హాలిడేస్ మాత్రం కామన్ గా ఉంటాయి.

సెప్టెంబర్ 3 (బుధవారం) : కర్మ పూజ సందర్భంగా జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సెలవు.
సెప్టెంబర్ 4 (గురువారం) : కేరళలో ఓనం మొదటి రోజు సందర్భంగా హాలిడే
సెప్టెంబర్ 5 (శుక్రవారం) : మిలాద్-ఉన్-నబీ సందర్భంగా అహ్మదాబాద్, ఐజ్వాల్, బేలాపూర్, బెంగళూరు, భోపాల్, చెన్నై, డెహ్రాడూన్, హైదరాబాద్, ఇంఫాల్, కాన్పూర్, లక్నో, ముంబై, నాగ్‌పూర్, న్యూ ఢిల్లీ, రాంచీ, శ్రీనగర్, తిరువనంతపురం, విజయవాడలో బ్యాంకులకు సెలవు.
సెప్టెంబర్ 6 (శనివారం): ఇంద్రజాత్ర సందర్భంగా సిక్కిం, జమ్ము, రాయ్‌పూర్, శ్రీనగర్‌లో బ్యాంకులు పనిచేయవు.
సెప్టెంబర్ 7 : ఆదివారం
సెప్టెంబర్ 12 (శుక్రవారం) : ఈద్ ఇ మిలాద్ ఉల్ నబీ సందర్భంగా జమ్ము, శ్రీనగర్ ప్రాంతాల్లో బ్యాంకులు మూసి ఉంటాయి.
సెప్టెంబర్ 13 : రెండో శనివారం
సెప్టెంబర్ 14 : ఆదివారం
సెప్టెంబర్ 21 : ఆదివారం
సెప్టెంబర్22 (సోమవారం): నవరాత్రి స్థాపన సందర్భంగా రాజస్థాన్‌లో బ్యాంకులకు సెలవు.
సెప్టెంబర్ 23 (మంగళవారం) : మహారాజా హరి సింగ్ జీ జన్మదినాన్ని పురస్కరించుకుని జమ్ము, శ్రీనగర్‌లో బ్యాంకులకు సెలవు.
సెప్టెంబర్ 27 : నాలుగో శనివారం
సెప్టెంబర్ 28 : ఆదివారం
సెప్టెంబర్ 29 (సోమవారం) : మహా సప్తమి/దుర్గాపూజ సందర్భంగా త్రిపుర, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు ఉంటుంది.
సెప్టెంబర్ 30 (మంగళవారం) : మహా అష్టమి / దుర్గాష్టమి / దుర్గా పూజ సందర్భంగా త్రిపుర, ఒడిశా, అస్సాం, మణిపూర్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేయవు.

## మహిళలకు ఊహించని దెబ్బ..

### రికార్డ్ స్థాయిలో పెరిగిన బంగారం ధర!



**న్యూఢిల్లీ:** దేశంలో బంగారం ధరలు మళ్లీ పరుగులు పెడుతున్నాయి. మహిళలకు ఊహించని దెబ్బ కొట్టింది. తగ్గినట్లే తగ్గి ఒక్కసారిగా రికార్డు స్థాయిలో దూపుకుపోతోంది. తలం బంగారం ధర ఇప్పుడు లక్షా 5 వేల రూపాయల వరకు ఉంది. ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నమాట. గత కొన్ని రోజులుగా పసిడి ధరలు ఊగిసలాడుతున్నాయి. శుక్రవారంతో పోలిస్తే శనివారం బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఎగబాకింది. మరి దేశంలో తులం బంగారం ధర ఎంత పెరిగిందో తెలిస్తే మీరే షాకవుతారు.

శనివారం మధ్యాహ్నం సమయానికి బంగారం ధరల్లో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. తులం బంగారంపై ఏకంగా 1640 రూపాయలు పెరిగింది. దీని బట్టి చూస్తే ఇంకా ఎంత పెరుగుతుందో ఊహించవచ్చు. తగ్గిటప్పుడు తక్కువ నమోదు అవుతున్నప్పటికీ పెరిగేటప్పుడు మాత్రం రెట్టింపు స్థాయిలో పెరుగుతోంది. ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం ధర రూ.1640 పెరిగి 1,04,950కు చేరుకుంది. అంటే దాదాపు రూ.లక్షా 5వేల వద్ద నమోదైనట్లే. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధరపై రూ.1200 పెరిగి 96,200 రూపాయల వద్ద ఉంది.

ఇక వెండి విషయానికొస్తే ఇది కూడా నేనెందుకు తగ్గాలి అన్నట్లు 1100 రూపాయలు పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి ధర 1,21,000 ఉంది. ఇక హైదరాబాద్, కేరళ, చెన్నై నగరాల్లో అయితే మరింత ఎక్కువగా ఉంది. ఇక్కడ కిలో సిల్వర్ ధర 1,31,000 ఉంది.

ఇదిలా ఉంటే.. భారతదేశంలో బంగారం ధరలు సామాన్యులకు షాక్ ఇస్తున్నాయనే చెప్పాలి. ఇప్పటికే ఆకాశాన్నంటిన బంగారం ధరలు.. సామాన్యుడు సైతం కొనలేని పరిస్థితి ఉంది. సామాన్యుడు కూతురు పెళ్లి కోసం తులం బంగారం కొనాలంటేనే లక్షా 5 వేల వరకు చెల్లించుకునే పరిస్థితి ఉంది. అలాంటిది సామాన్యుడు కొనాలంటేనే భయపడిపోతున్నాడు. ఇక ఇప్పుడు పండుగ సీజన్ కొనసాగుతోంది. రానున్న రోజుల్లో దసరా, దీపావళి పండలు ఉన్నాయి. ఇంకా మరింత పెరిగే అవకాశం కనిపిస్తోందని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఆగస్టు నెలలో ధరలు తగ్గుతాయని చాలా మంది భావించినప్పటికీ అవేమి జరగలేదు. బులియన్ మార్కెట్ నిపుణుల ప్రకారం.. బంగారం ధరల పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి పెరగడం, డాలర్ విలువలో మార్పులు రావడం, అంతర్జాతీయ మార్కెట్లో బంగారం డిమాండ్ అధికంగా ఉండటం ఇవన్నీ ప్రధాన కారణాలు అని చెబుతున్నారు. అంతేకాదు ద్రవ్యోల్బణం పెరిగిన సందర్భాల్లో చాలా మంది పెట్టుబడిదారులు బంగారం వైపు మళ్లడం వల్ల ధరలు ఇంకా ఎగబాకుతున్నాయి. ఇక రానున్న పండుగ సీజన్‌లో భారత్‌లో బంగారం డిమాండ్ మరింత పెరుగుతుందని అంచనా.

## సెప్టెంబర్ 1 నుంచి మారనున్న బ్యాంకుల నియమాలు..



**న్యూఢిల్లీ:** సెప్టెంబర్ 2025 ప్రారంభం సామాన్యులకు అనేక కొత్త మార్పులను తీసుకువస్తోంది. ఈ మార్పులు గృహ ఖర్చులు, బ్యాంకింగ్, పెట్టుబడి, రోజువారీ అవసరాలకు సంబంధించినవి. మీరు ఈ నియమాలను ముందుగానే తెలుసుకుంటే మీరు బడ్జెట్‌ను నిర్వహించగలుగుతారు. కానీ అనవసరమైన ఖర్చులను కూడా నివారించవచ్చు. ఇప్పటివరకు బంగారు ఆభరణాలపై మాత్రమే హాల్‌మార్కింగ్ అనే నియమం ఉండేది. కానీ సెప్టెంబర్ 1 నుండి ఈ నియమం వెండిపై కూడా వర్తిస్తుంది. అంటే ఇప్పుడు మీరు ఏ వెండి ఆభరణాలు లేదా పాత్రలను కొనుగోలు చేసినా దానికి ఖచ్చితంగా హాల్‌మార్క్ ముద్ర ఉంటుంది. ఇది వినియోగదారులకు స్వచ్ఛమైన నమ్మకమైన ఉత్పత్తులను అందిస్తుంది. నకిలీ వస్తువుల నుండి వారిని రక్షిస్తుంది. అయితే దీని కారణంగా వెండి ధరలలో కొన్ని హెచ్చుతగ్గులు ఉండవచ్చని ఆభరణాల వ్యాపారులు భావిస్తున్నారు.

# రాజస్థాన్ రాయల్స్‌కు బిగ్ షాక్..

### హెడ్‌కోచ్‌గా వైదొలిగిన ద్రవిడ్..!



**రాజస్థాన్:** ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ ముందు రాజస్థాన్ రాయల్స్‌కు బిగ్ షాక్. సుదీర్ఘ కాలానికి హెడ్‌కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన రాహుల్ ద్రవిడ్ అనూహ్యంగా పదవి నుంచి వైదొలిగాడు. స్క్వాడ్‌లో మార్పులపై ఊహాగానాలు వినిపిస్తున్న వేళ ఈ వెటరన్ అకస్మాత్తుగా కోచింగ్ బాధ్యతలకు బైబై చెప్పేశాడు. దాంతో.. మరికొన్నాళ్లు తమ ఫ్రాంచైజీకి కోచ్‌గా ఉంటాడని భావించిన రాజస్థాన్‌కు ఇది ఊహించని షాక్. ఈ దిగ్గజ ప్లేయర్ రాజీనామా చేశాడనే విషయాన్ని రాజస్థాన్ యాజమాన్యం ధ్రువీకరించింది.

'కొన్నేళ్లుగా రాజస్థాన్ రాయల్స్ జర్నీలో ద్రవిడ్ ఆటగాడిగా, కెప్టెన్‌గా, కోచ్‌గా కీలకంగా వ్యవహరిస్తూ వచ్చాడు. నవతరం క్రికెటర్లపై అతడి నాయకత్వం ఎంతో ప్రభావం చూపించింది. స్క్వాడ్‌లో విలువలు పెంపొందించాడు. ఫ్రాంచైజీలో ఒక మంచి సంస్కృతికి శ్రీకారం చుట్టాడు. రాజస్థాన్ ఫ్రాంచైజీ నిర్మాణాత్మక కూర్పులో ద్రవిడ్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలనుకున్నాం.

కానీ, అతడు మాత్రం సున్నితంగా తిరస్కరించాడు. రాజస్థాన్ ఆటగాళ్లు, లక్షలాది మంది అభిమానులు కోచ్‌గా ద్రవిడ్ విశేషమైన సేవలకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నారు 'అని ఫ్రాంచైజీ ప్రకటనలో వెల్లడించింది. ద్రవిడ్ వైదొలగడంతో డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా ఉన్న కుమార సంగక్కరకు మళ్లీ కోచ్ పగ్గాలు అప్పగిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి.

### చక్రాల కుర్చీలోంచే

నిరుడు భారత జట్టుకు టీ20 వరల్డ్ కప్ అందించిన రాహుల్ ద్రవిడ్ 18వ సీజన్‌లో రాజస్థాన్ హెడ్‌కోచ్‌గా నియమితులయ్యాడు. సీజన్ ప్రారంభానికి ముందే ఎడమ పాదానికి గాయం కావడంతో చక్రాల కుర్చీలోంచే జట్టుకు సూచనలు, సలహాలు ఇచ్చాడు ద్రవిడ్. కానీ, అతడి మార్గనిర్దేశనంలో రాజస్థాన్ దారుణంగా విఫలైమంది.

## క్వార్టర్స్‌లోకి సాత్విక్-చిరాగ్ జోడీ..

### వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పతకం ఖాయం !

**న్యూఢిల్లీ:** బ్యాడ్మింట్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత జోడికి పతకం ఖాయమైంది. శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడి 21-12, 21-19 స్కోరుతో విజయం సాధించారు. మలేషియాకు చెందిన ఒలింపిక్ మెడలిస్టు జోడి ఆరన్ చియా, సోహ్ వూయి యిక్‌లపై గెలుపొందారు. సెమీస్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఇండియన్ జోడికి దాదాపు పతకం ఖాయమైనట్లే. పారిస్ ఒలింపిక్స్‌లో మలేషియా జోడి చేతిలో ఓడిన ఇండియన్ షట్లర్లు ఇవాళ ప్రతీకారం తీర్చుకున్నారు. కేవలం 43 నిమిషాల్లోనే ఈ మ్యాచ్‌ను ముగించారు.

మ్యాచ్ గెలవడం అద్భుతంగా ఉన్నట్లు చిరాగ్ తెలిపాడు. మలేషియా ప్రత్యర్థులతో ఆడడం ఉత్సాహంగా ఉన్నట్లు చెప్పారు. చాలా సార్లు గట్టి పోటీ ఎదుర్కోవాల్సి వచ్చిందని, అయితే ఇవాళ గెలవడం నిజంగా సంతోషంగా ఉన్నట్లు చిరాగ్ చెప్పాడు. 2022 ఈవెంట్‌లో సాత్విక్-చిరాగ్ జోడి బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు మరో పతకాన్ని గెలుచుకోనున్నారు.



ఏషియన్ గేమ్స్ చాంపియన్స్‌గా నిలిచిన భారత జోడి మెన్స్ డబుల్స్ సెమీఫైనల్లో 11వ సీట్ ప్లేయర్లు చెన్ బో యాంగ్, లియు యితో తలపడనున్నారు. సెమీస్‌లో ఆడుతున్నప్పుడు అండర్‌డాగ్స్ ఎవరూ ఉండరని చిరాగ్ అన్నాడు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు క్వార్టర్స్‌లో ఓడిన విషయం తెలిసిందే.

### సెలెక్టర్ల వైఖరి.. ఆ రెండు విషయాలు

## నచ్చకే జట్టును వీడాను..!

**న్యూఢిల్లీ:** రంజీ సీజన్ ప్రారంభానికి ముందే సొంత జట్టు అయిన తమిళనాడును వీడిన విజయ్ శంకర్ ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. అసంతృప్తితోనే తాను కీలక నిర్ణయం తీసుకున్నట్టు ఈ ఆల్‌రౌండర్ తెలిపాడు. దులీప్ ట్రోఫీకి ముంది జట్టును వీడడానికి దారి తీసిన కారణాలను శంకర్ పంచుకున్నాడు. సెలెక్టర్ల తీరు నచ్చకపోవడం, పదే పదే తనను పక్కనపెట్టేయడం వంటివి చికాకు తెప్పించడం వల్లనే తాను తమిళనాడుకు బైబై చెప్పానని ఈ డాషింగ్ బ్యాటర్ వెల్లడించాడు.

కొన్నిసార్లు మనం ఇష్టంలేకున్నా సరే నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. గతాన్ని మరచిపోయి కొత్త అవకాశాల్ని వెతుక్కోవాల్సి ఉంటుంది. నేను బాగానే ఆడుతున్నాని నాకు తెలుసు. కానీ, జట్టులో చోటు దక్కకపోవడం నన్ను ఎంతో బాధించింది. బెంచ్ మీద ఖాళీగా ఉండడం, డ్రింక్స్ బ్రేక్‌లో నీళ్ల బాటిళ్లు మోసుకెళ్లడం నాకు చిరాకు తెప్పించాయి. కొన్నేళ్లు ఆడిన నాకు ఇవన్నీ చాలా కష్టంగా తోచాయి. నిరుడు రంజీ టోర్నీ మొదటి రెండు మ్యాచ్‌లకు నన్ను తీసుకోలేదు.

అయితే.. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీతో మళ్లీ జట్టులోకి వచ్చాను. కానీ.. చివరి రెండు గేమ్‌లకు నన్ను తప్పించారు. అలా ఎందుకు చేశారో నాకు అర్థం కాలేదు. స్క్వాడ్‌లో ఉన్నా తుది జట్టులో ఉండకపోవడం.. సెలెక్టర్లు నాకు



స్పష్టత ఇవ్వకపోవడం వంటివి తమిళనాడు జట్టుకు నన్ను దూరం చేశాయి అని 34 ఏళ్ల శంకర్ తన ఆవేదనను వెల్లగక్కాడు.

### విహారితో కలిసి..

ఈమధ్యే జరిగిన బుచ్చిబాబు టోర్నమెంట్‌లో శంకర్‌ను పక్కన పెట్టేశారు సెలెక్టర్లు. దాంతో, చిర్రెత్తుకొచ్చిన అతడు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలని.. తాను కొత్త జట్టుకు ఆడాలని అనుకుంటున్నట్టు టీఎన్‌సీఏను కోరాడు. అతడి అభ్యర్థనను అంగీకరిస్తూ.. ఎన్ఓసీ మంజూరు చేసింది తమిళనాడు క్రికెట్ సంఘం. ప్రస్తుతం జరుగుతున్న దేశవాళీ సీజన్‌లో శంకర్ త్రిపుర ఆటగాడిగా బరిలోకి దిగనున్నాడు. ఆంధ్ర క్రికెట్ సంఘం నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకున్న హనుమా విహారి సైతం ఇదే జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. 2012 నుంచి తమిళనాడుకు ఆడుతున్న విజయ్ శంకర్ 81 రంజీ మ్యాచుల్లో.. 44.25 సగటుతో 3,142 రన్స్ సాధించాడు. నిరుడు సీజన్‌లో అతడు ఛండీగఢ్ మీద 150 పరుగులతో అజేయంగా నిలిచాడు.

# సెప్టెంబర్‌లో 40 డిగ్రీల ఎండ..

# ఆసియాకప్ షెడ్యూల్‌లో మార్పులు..!

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ పోటీలకు తటస్థ వేదికగా ఎంపికైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఎండలు మండిపోనున్నాయి. ఎడారి దేశంలో అయినందున సెప్టెంబర్‌లో అక్కడ పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటే అవకాశముంది. ఒకవేళ అదే జరిగితే ఎండవేడికి ఆటగాళ్లు చెమటలు కక్కాల్సిందే. ఉక్కపోత.. వేడి గాలుల తీవ్రతతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మెగా టోర్నీలో ఆటగాళ్లకు ఇలాంటి కష్టాలు రాకూడదని నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. 19 లీగ్ మ్యాచ్‌లతో పాటు ఫైనల్ ఫైట్ సమయంలోనూ మార్పులు చేశారు.

సెప్టెంబర్ 9 నుంచి యూఏఈ వేదికగా పదిహేడో సీజన్ ఆసియా కప్ షురూ కానుంది. అయితే.. ఈ నెల ప్రారంభం నుంచి అక్కడ పగటిపూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతాయని, సాయంత్రం 6 గంటల వరకూ ఎండ తీవ్రత కొనసాగనుందని స్థానిక వాతావరణ శాఖ చెబుతోంది. అంతటి ఎండలో మ్యాచ్‌లు అంటే ఆటగాళ్లు హడలెత్తిపోతారు. అందుకే.. బీసీసీఐతో పాటు శ్రీలంక, అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్ బోర్డులు మ్యాచ్‌ల సమయాన్ని




మార్చాలని నిర్వాహకులను కోరాయి. ఆసియా దేశాల బోర్డుల అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన యూఏఈ క్రికెట్.. డే-నైట్ మ్యాచ్‌ల షెడ్యూల్ మార్చింది.

ముందుగా ప్రకటించిన సమయానికి అరగంట ఆలస్యంగా మ్యాచ్‌లు జరపాలని నిర్ణయించింది. అంటే.. సాయంత్రం 6:30 గంటల నుంచి (భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలు)లకు డై-నైట్ మ్యాచ్‌లు మొదలవుతాయి. ఇదే విషయాన్ని బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ అయిన సోనీ స్పోర్ట్స్‌కు తెలియజేశారు నిర్వాహకులు. అయితే.. ఒకేఒక మ్యాచ్ సమయం మాత్రం మారలేదు. సెప్టెంబర్ 15న ఆతిథ్య యూఏఈ, ఒమన్ జట్లు పగటిపూటనే అబుదాబీలోని జయెద్ క్రికెట్ స్టేడియంలో తలపడనున్నాయి.

రెండు స్టేడియాల్లో..

ఆసియాకప్‌లో రెండు గ్రూపుల్లోని ఎనిమిది జట్లు కలిపి లీగ్ దశ.. సూపర్ 4 స్టేజ్ వరకూ 19 మ్యాచ్‌లు ఆడుతాయి. సెప్టెంబర్ 9న అఫ్గనిస్థాన్, హాంకాంగ్ మధ్య ఆరంభ పోరు జరుగనుంది. మరుసటి రోజు భారత జట్టు, ఆతిథ్య యూఏఈని ఢీకొట్టనుంది. ఇప్పటివరకూ 8 పర్యాయాలు (ఏడుసార్లు వన్డే ఫార్మాట్, ఒకసారి టీ20 ఫార్మాట్) ఈ మెగా టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచింది టీమిండియా. బ్యాటింగ్ యూనిట్ నిండా విధ్వంసక హిట్టర్లే ఉండడంతో మరోసారి టైటిల్‌తో మురిసిపోవాలనే పట్టుదలతో ఉంది సూర్యకుమార్ యాదవ్ బృందం. దుబాయ్‌లోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, అబుదాబీలోని షేక్ జయెద్ స్టేడియంలో ఆసియా కప్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

### దసరా కానుకగా
# పవన్ కళ్యాణ్ ఓజీ
### సువ్విసువ్వి పాటకు వేలాది లైక్‌లు




**టాకీస్:** హరిహర వీరమల్లు చిత్రంతో నిరాశపరిచిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఓజీ చిత్రంతో ఫ్యాన్స్‌కి మంచి కిక్ ఇవ్వబోతున్నాడు. ఈ సినిమా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న ' ఓజీ ' చిత్రం దసరా కానుకగా సెప్టెంబర్ 25న రిలీజ్ కానుంది. నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతోన్న 'అఖండ 2' చిత్రం దసరాకి వస్తుందని ముందు ప్రచారం జరిగినా, అది రేసు నుంచి తప్పుకోవడంతో 'ఓజీ'కి మరింత ప్లస్ కానుంది. సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్–టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మించారు. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రానున్న ఈ చిత్రంలో పవన్ సరసన ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తోంది. ఎప్పుడో రావాల్సిన ఈ చిత్రం పవన్ కళ్యాణ్ బిజీ షెడ్యూల్ కారణంగా కాస్త ఆలస్యమైంది. చివరికి అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని సెప్టెంబర్ 25న రిలీజ్‌కి సిద్ధమైంది. ఓవర్సీస్‌లో ఒకరోజు ముందుగానే ప్రీమియర్ షోలు పడనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ కూడా మొదలయ్యాయి. ఈ చిత్రానికి సంబంధించి స్టోరీ లైన్ ఒకటి బలంగా వినిపిస్తోంది. అదే నిజమైతే 'ఓజీ' బ్లాక్‌బస్టర్ కావడం ఖాయం అంటూ ఫ్యాన్స్ చెప్పుకొస్తున్నారు. సోషల్‌మీడియాలో వినిపిస్తోన్న సమాచారం ప్రకారం ... ముంబయి అండర్ వరల్డ్ నుండి పూర్తిగా మాయమైన 'ఓజస్ గంభీర' మళ్లీ తిరిగి రావడం, చీకటి ప్రపంచాన్ని శాసిస్తోన్న నిరంకుశ శత్రువైన ఓమి భావుని మట్టి కరిపించి తన సామ్రాజ్యాన్ని మళ్లీ ఎలా హస్తగతం చేసుకున్నాడన్నది చిత్ర కథగా తెలుస్తుంది. ఓజస్ గంభీర ప్రత్యర్థుల్ని ఎంత కిరాతకంగా హతమార్చాడు, నమ్మక ద్రోహానికి పాల్పడిన వారిని ఎలా శిక్షించాడు వంటి సీన్స్‌ని సుజీత్ చాలా అద్భుతంగా తెరకెక్కించాడట. పదేళ్లు కనిపించకుండా పోయిన ఓజస్ ఎక్కడికి వెళ్లాడు, ఏం చేశాడు అన్నది ఏ మాత్రం గెస్ చేయలేరట. కథ వినడానికి రొటీ–న్‌గానే ఉన్నా సుజీత్ టేకింగ్ సినిమాని మరో స్థాయికి తీసుకెళతాడని ముచ్చటించుకుంటున్నారు. వినాయక చవితి సందర్భంగా రిలీజ్ చేసిన 'సువ్వి సువ్వి' సాంగ్‌లో అయితే పవన్ లుక్ ఫ్యాన్స్‌కి తెగ నచ్చేసింది అని చెప్పాలి. ఈ మూవీ కోసం ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## చిరుతో...వెంకటేశ్ చేరేది అప్పడే

**టాకీస్:** 'మన శంకరవరప్రసాద్ గారు'గా సంక్రాంతి బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఆయన –టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. హీరో



వెంకటేశ్ ఇందులో ప్రత్యేక పాత్రలో సందడి చేయనున్నట్లు– అనిల్ ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమా కోసం ఆయన వచ్చే నెల మధ్య నుంచి సెట్లోకి అడుగు పెట్టనున్నట్లు– సమాచారం. హైదరాబాద్‌లో మొదలు కానున్న ఈ కొత్త షెడ్యూల్ కోసం ఇప్పటికే సన్నాహాలు మొదలయ్యాయి. ఈ కథలో వెంకీ పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉందని.. చిరుతో పాటతో పాటు– యాక్షన్ సీక్వెన్స్‌లోనూ భాగమయ్యే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. వినోదం, యాక్షన్ అంశాల మేళవింపుతో సాగే ఈ కుటుంబ కథా చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.




# మళ్లీ గ్లామరస్ రోల్స్..
### కమ్ బ్యాక్ ఎంట్రీకి కంగనారనౌత్ ప్లాన్..?

టాకీస్: ఓ వైపు సినిమాలు, మరోవైపు పాలిటిక్స్.. ఇలా ప్లాట్‌ఫాం ఏదైనా తనదైన బోల్డ్ కామెంట్స్‌తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుంటుంది బాలీవ్డు భామ కంగనరనౌత్. చివరగా ఎమర్జెన్సీ సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ బ్యూటీ గ్లామరస్ రోల్స్ చేయక చాలా కాలమే అవుతుంది. అయితే ఈ బ్యూటీ మళ్లీ తనలోకి గ్లామర్ యాంగిల్‌ను చూపించేందుకు రెడీ అవుతుందన్న వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

బీటౌన్ సర్కిల్‌లో రౌండప్ చేస్తున్న తాజా కథనాల ప్రకారం కంగనారనౌత్ డైరెక్టర్లు వికాస్ బహల్, ఆనంద్ ఎల్ రాయ్‌తో మరోసారి కలిసి చేయబోతుందట. కంగనారనౌత్ ఈ సారి హిట్ ప్రాజెక్టుల సీక్వెల్స్‌తో ట్రాక్‌పైకి వచ్చేలా క్వీన్ 2, తను వెడ్స్ మను 3 సినిమాలను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు ప్లాన్ చేస్తుందని తాజాగా ఓ వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో చక్కర్లు కొడుతోంది. కంగనా ఈ ఏడాది నవంబర్ నుంచి క్వీన్ సీక్వెల్ షురూ చేయనుందని సమాచారం. వికాస్ బాల్ ఇప్పటికే క్వీన్ సీక్వెల్ రెడీ చేశాడని.. ప్రస్తుతం యూకేలో లొకేషన్ల వేటలో ఉన్నాడని బాలీవుడ్ సర్కిల్ సమాచారం.

సీక్వెల్ మొదటి పార్ట్ లాగే ఇండియాతోపాటు ఓవర్సీస్ బ్యాక్‌డ్రాప్‌లో కొనసాగనుందని తెలుస్తోంది. ఇక క్వీన్ 2 పూర్తి చేసిన తర్వాత తను వెడ్స్ మను 3ను సెట్స్‌పైకి తీసుకెళ్లాలని ఫిక్స్ అవగా.. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ కూడా పూర్తయినట్టు ఇన్ సైడ్ టాక్. తేరే ఇష్క్ మే తర్వాత ఆనంద్ ఎల్ రాయ్ చేయబోయే ప్రాజెక్ట్ ఇదేనని బీటౌన్ సర్కిల్ సమాచారం. మొత్తానికి ఓ వైపు ఎంపీగా రాజకీయాల్లో బిజీగా ఉన్న కంగనారనౌత్.. ఇక సీక్వెల్స్‌తో మళ్లీ ఫాంలోకి రావాలని గట్టిగానే ప్రయత్నిస్తున్నట్టు తాజా కథనాలు క్లారిటీ ఇచ్చేస్తున్నాయి.



## రోషన్ కనకాల 'మోగ్లీ' గ్లింప్స్..
### ఆకట్టుకుంటున్న రగ్గడ్ లుక్

టాకీస్: యువ కథానాయకుడు రోషన్ కనకాల తన తాజా చిత్రం 'మోగ్లీ 2025'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చిత్ర యూనిట్ ఒక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ గ్లింప్స్‌ను మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లాంచ్ చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ గ్లింప్స్‌లో హీరో నాని వాయిస్ ఓవర్‌తో ప్రారంభం కావడం విశేషం. ఇందులో రోషన్ కనకాల రగ్గడ్ అవతారంలో, పూర్తి కొత్త లుక్‌లో కనిపించి అందరినీ ఆకట్టుకున్నాడు. కథానాయికగా సాక్షి మడోల్కర్, విలన్‌గా బండి సరోజ్ కుమార్ మంచి ఇంపాక్ట్ క్రియేట్ చేశారు. 2025లో అటవీ నేపథ్యంతో సాగే ఒక ప్రేమకథగా ఈ సినిమా రూపొందుతున్నట్లు గ్లింప్స్‌లో చూపించారు. అటవీ సన్నివేశాలు, గ్రాఫిక్స్ సినిమాపై ఆసక్తిని పెంచే విధంగా ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరామెన్‌గా రామ మారుతి.ఎం, సంగీత దర్శకుడిగా కాలభైరవ పని చేస్తున్నారు. ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉంది.

# అల్లు అరవింద్ ఇంట విషాదం
### అల్లు రామలింగయ్య సతీమణి కన్నుమూత
### భౌతిక కాయం సదర్శించిన నివాళి అర్పించిన ప్రముఖులు





**టాకీస్:** అల్లు అరవింద్ ఇంట విషాదం నెలకొంది. ఆయన తల్లి, దివంగత అల్లు రామలింగయ్య భార్య కనకరత్నమ్మ (94) కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న ఆమె శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలిసిన వెంటనే చిరంజీవి కుటుంబం అల్లు అరవింద్ ఇంటికి చేరుకున్నారు. ప్రస్తుతం రామ్ చరణ్, అల్లు అర్జున్‌లు షూటింగ్ నిమిత్తం మైసూర్, ముంబయిలో ఉన్నారు. మధ్యాహ్నం వారు హైదరాబాద్ చేరుకున్నారు. కనకరత్నమ్మ మరణవార్త తెలుసుకున్న సినీ ప్రముఖులు ఆమె పార్థివదేహానికి నివాళులు అర్పించేందుకు అల్లు అరవింద్ ఇంటికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నివాసం వద్ద బందోబస్తు ఏర్పాటు–చేశారు. మా అత్తయ్య.. దివంగత అల్లు రామలింగయ్య భార్య కనకరత్నమ్మ శివైక్యం చెందడం ఎంతో బాధాకరం. మా కుటుంబాలపై ఆమె చూపిన ప్రేమ, ధైర్యం, జీవిత విలువలు ఎప్పటికీ మాకు ఆదర్శం. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని చిరంజీవి అన్నారు. మా అత్తయ్య.. దివంగత అల్లు రామలింగయ్య భార్య కనకరత్నమ్మ శివైక్యం చెందడం ఎంతో బాధాకరం. మా కుటుంబాలపై ఆమె చూపిన ప్రేమ, ధైర్యం, జీవిత విలువలు ఎప్పటికీ మాకు ఆదర్శం. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను' అని తెలిపారు. కనక రత్నమ్మ గారి జీవితం, కుటుంబం కోసం చూపిన సేవ, ప్రేమ, మరియు ధైర్యం ఎల్లప్పుడూ అల్లు కుటు–ంబం కోసం మార్గదర్శకంగా నిలుస్తుంది. దివంగత అల్లు రామలింగయ్య సతీమణి కనకరత్నమ్మ కన్నుమూశారని తెలిసి చింతిస్తున్నాను. చెన్నైలో ఉన్నప్పటినుంచి ఎంతో ఆప్యాయత చూపేవారు. చుట్టూఉన్నవారిపై అమితమైన ప్రేమాభిమానాలు చూపేలా తన కుమార్తె సురేఖను తీర్చిదిద్దారు. కనకరత్నమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. అల్లు అరవింద్‌కు, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. వార్తతెలిసిన వెంటనే అల్లు అర్జున్ కూడా చేరుకున్నారు. నానమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న అల్లు అర్జున్ ముంబైలో తన సినిమా షూటింగ్‌ను మధ్యలో ఆపేసి హుటాహుటిన హైదరాబాద్ వచ్చారు. అనంతరం నానమ్మ మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.